



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 296 | ది. 5-2-2026 | గురువారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 296 | Date : 5-2-2026 | Thursday | Pages : 8 | Rs.1/- |


## వైసిపి కుట్రలను సమన్వయంగా ఎదుర్కొందాం

- రెండున్నర గంటలపాటు సాగిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశం
- వైసీపీ కుట్రలు, కూటమి సమన్వయంపై ప్రధానంగా చర్చ
- రాజ్యసభ స్థానాలు, నామినేటెడ్ పదవుల భర్తీపై సమాలోచనలు
- క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం



**అమరావతి,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మధ్య అమరావతిలో జరిగిన కీలక భేటీ ముగిసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం సుమారు రెండున్నర గంటల పాటు కొనసాగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, కూటమి పక్షాల మధ్య సమన్వయం, భవిష్యత్ కార్యాచరణ వంటి అనేక కీలక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా, వైసీపీ అనుసరిస్తున్న వైఖరి పైనే ఈ సమావేశంలో ఎక్కువగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కుల రాజకీయాలను రెచ్చగొట్టడం ద్వారా వైసీపీ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని, ఆ పార్టీ పన్నుతున్న వ్యూహాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఇరువురు నేతలు నిర్ణయించుకున్నారు. వైసీపీ ట్రాప్‌లో పడకుండా కూటమి శ్రేణులను అప్రమత్తం చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని తీర్మానించుకున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య వైసీపీ చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇరువురు నేతలు ఓ అభిప్రాయానికి వచ్చారు. ఈ భేటీలో రాజకీయ అంశాలతో పాటు పరిపాలనాపరమైన విషయాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి. త్వరలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల భర్తీపై నేతలు ప్రాథమికంగా చర్చించినట్లు సమాచారం. అలాగే, చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా నిర్ణయించినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లతో పాటు డైరెక్టర్ల నియామకంపై కూడా సమాలోచనలు జరిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సమావేశంలో అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. తిరుమల లడ్డూ ప్రసాదం వంటి అంశాలపై వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలని, ఇందుకోసం కూటమిలోని మూడు పార్టీల నేతలు కలిసి ఉమ్మడి మీడియా సమావేశాలు నిర్వహించాలని పవన్ సూచించినట్లు సమాచారం. రాబోయే 15 ఏళ్లు కూటమే అధికారంలో కొనసాగేలా పటిష్టమైన భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలనే దిశగా కూడా వీరి మధ్య చర్చలు సాగినట్లు తెలుస్తోంది. నిన్న కేబినెట్ భేటీకి ముందు చంద్రబాబు, పవన్ క్లుప్తంగా మాట్లాడుకున్నప్పటికీ, అన్ని అంశాలపై విపులంగా చర్చించేందుకు ఈరోజు ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

## కేసీఆర్ తెలంగాణ జాతిపిత ఎలా అవుతారు?

## రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం..

- పదేళ్లు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు
- మొగుడు పెళ్లాం మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం
- బీఆర్ఎస్ నాయకులు దోపిడీదారులు అంటూ విమర్శలు



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మిర్యాలగూడ మండలం గూడురులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. వేల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని మండిపడ్డారు. ఆస్తులు సంపాదించుకున్నా మనం ఏమనలేదని, కానీ పెళ్లాం, మొగుడు మాట్లాడుకుంటే కూడా ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన తీవ్ర పదజాలం ఉపయోగించారు. జడ్జిలు, జర్నలిస్టులు, ప్రతిపక్ష నాయకులు, సినిమా తారలను ఎవరినీ వదలలేదని విమర్శించారు. ఎవరు ఫోన్లో మాట్లాడుకుంటే బీఆర్ఎస్ నాయకులకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ చేసినందుకు కేసీఆర్, ఆయన కుటుంబానికి దర్యాప్తు బృందం నోటీసులు ఇచ్చిందని అన్నారు. “జాతిపితకు నోటీసులు ఇస్తారా” అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారని, ఆయన ఎవరికి జాతిపిత అని నిలదీశారు. మీ నాయకులకు మీరు జాతిపిత కావొచ్చు కానీ మాకెందుకు అవుతారని ప్రశ్నించారు. తెలంగాణ కోసం సర్వం ధారపోసిన ప్రొఫెసర్ జయశంకర్ జాతిపిత అవుతారని, లేదంటే ఏపీలో అధికారం పోయినా పర్వాలేదని తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ తెలంగాణ తల్లి అవుతుంది తప్ప మీలాంటి దోపిడీదారు తెలంగాణ జాతిపిత ఎలా అవుతారని రేవంత్ రెడ్డి నిలదీశారు.

## "స్వయం" పేరుతో డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్

- జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను ఆకట్టుకునేలా బ్రాండింగ్
- సెర్ప్, మెప్మాపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** డ్వాక్రా ఉత్పత్తులకు బ్రాండింగ్ కోసం “స్వయం” అనే పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఖరారు చేశారు. డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించే అంశంపై బుధవారం సీఎం చంద్రబాబు సచివాలయంలో సమీక్షించారు. బ్రాండింగ్ కల్పించే ప్రక్రియలో భాగంగా అధికారులు ప్రతిపాదించిన వివిధ పేర్లు.. లోగోలను సీఎం పరిశీలించారు. అధికారులు ప్రతిపాదించిన రెండు లోగోలను పరిశీలించిన సీఎం... లోగో ఖరారుపై డ్వాక్రా సంఘాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. మెజార్టీ అభిప్రాయం మేరకు లోగో ఖరారుపై నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."డ్వాక్రా మహిళలు అద్భుతమైన ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వారికి మంచి మార్కెటింగ్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. స్థానికంగా ఉండే మార్కెట్లే కాకుండా.. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను కూడా ఆకర్షించేలా.. మహిళా ఉత్పత్తులకు డిమాండ్ పెరగాలంటే అదే స్థాయిలో బ్రాండింగ్ ఆకర్షణీయంగా ఉండాలి. బ్రాండ్ పేరు, లోగో ఆకట్టుకునేలా ఉండాలి. బ్రాండ్ పేరు, లోగోతోనే కాన్సెప్ట్ అందరికీ అర్థమయ్యేలా ఉండాలి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఉత్పత్తులను తెస్తున్నారు కాబట్టి... స్వయం అనే పేరు బాగుంటుంది. అదే తరహాలో లోగో డిజైన్ కూడా ఉండాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సెర్ప్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వాళ్లు ముగ్గురు లెంపలేసుకోవాలి : వైఎస్ జగన్ డిమాండ్



**గుంటూరు, ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** తమ పార్టీ నేతలు ఏం చేశారని ప్రభుత్వాన్ని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రశ్నించారు. గుంటూరులో అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించిన నేపథ్యంలో ఆయన మాట్లాడతూ సీఎం చంద్రబాబు పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోయిందని ఆరోపించారు. తమ నేతల ఇళ్లపై దాడులు చేసి భయానక వాతావరణాన్ని సృష్టించారని మండిపడ్డారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్, విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడుపై దాడి అత్యంత హేయమైన చర్య అని, వాళ్లు చేసిన తప్పేంటని జగన్ ప్రశ్నించారు. తిరుమల లడ్డూ వ్యవహారంపై ఉద్దేశపూర్వకంగా సీఎం చంద్రబాబు దుష్ప్రచారం చేశారని జగన్ వ్యాఖ్యానించారు.

**కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం..** నెయ్యి జంతువుల కొవ్వు కలవకపోయినా తమపై కుట్రపూరితంగా తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. తిరుమల భక్తుల మనోభావాలను సీఎం చంద్రబాబు దెబ్బతీశారని విమర్శించారు. నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదని కేంద్రానికి సంబంధించిన ఎన్డీడీబీ, ఎన్డీఆర్ఐ ల్యాబులే రిపోర్టులు ఇచ్చా యని గుర్తు చేశారు. లడ్డూ, నెయ్యి శాంపిల్స్ ను సీబీఐ ఆధ్వర్యంలో అన్ని టెస్టులు జరిగాయని, ఎలాంటి కల్తీ లేదని నివేదికలు ఇచ్చాయని జగన్ వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లెంపలేసుకోవాలని జగన్ డిమాండ్ చేశారు.

**అబద్ధం ఎందుకు చెబుతున్నారు..** తిరుమల లడ్డూపై కూటమి ప్రభుత్వం ఎందుకు అబద్ధం చెబుతోందని అంబటి రాంబాబు ప్రశ్నించారని, అందుకే దాడి చేస్తారా అని జగన్ ప్రశ్నించారు. గుడి దగ్గరకు వెళ్లి వస్తున్న అంబటిపై కర్రలతో అడ్డుకుంటారా అని ఆయన నిలదీశారు. పోలీసుల సమక్షంలో టీడీపీ నేతలు బూతులు తిడుతూ అంబటిపై తెగబడ్డారని మండిపడ్డారు. అంబటిని చుట్టుముట్టిన నేపథ్యంలో అంబటి రాంబాబు నోరు జారారని, వెంటనే ఆయన చింతిస్తున్నా అని చెప్పారని, అయినా కుట్రతోనే దాడి చేశారని ఆరోపించారు. పవన్ కల్యాణ్, లోకేశ్ గతంలో తనను చాలా సార్లు తిట్టారని గుర్తు చేశారు. సీబీఐ ఛార్జిషీట్లో నెయ్యి కల్తీ జరగలేదని చెప్పినా.. తమను రెచ్చగొట్టేలా రాష్ట్రమంతా ఫ్లెక్సీలు పెట్టారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ పేరుతో కూటమి ప్రభుత్వం చేసిన మోసంపై తామూ రాష్ట్రవ్యాప్తంగా ఫ్లెక్సీలు పెట్టాలా అని జగన్ నిలదీశారు. ప్రభుత్వ అబద్ధాలు, మోసాలపై ఫ్లెక్సీలు పెడితే ఊరుకుంటారా అని జగన్ ప్రశ్నించారు.

## నాడు కేసీఆర్ సంక్షేమం - నేడు కాంగ్రెస్ అరాచకం!!

- అబద్ధాల అభయహస్తం - కాంగ్రెస్ మార్క్ మోసం
- నియంతృత్వ పోకడలు - కూల్చివేతల పాలన
- రామగుండం గడ్డపై రౌడీల రాజ్యం
- పేదల పక్షపాతి కేసీఆర్,గులాబీ
- మున్సిపల్ పోరులో కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టండి
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**పెద్దపల్లి/ గోదావరిఖని,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** నాడు కేసీఆర్ సంక్షేమంతో సంతోషంగా - నేడు కాంగ్రెస్ అరాచకం పట్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురి అవుతున్నారని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రామగుండం 39వ డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కేసీఆర్ నాయకత్వం, అభివృద్ధి ఆవశ్యకతను తెలియజేశారు. గత పదేళ్లలో కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించి, సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ పెద్దన్నలా అండగా నిలిస్తే, నేడు కాంగ్రెస్ పాలనలో రామగుండం రౌడీల రాజ్యంగా మారిందని, రాత్రిపూట దొంగల మాదిరిగా దేవాలయాలను, చిరు వ్యాపారుల దుకాణాలను కూల్చివేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. అబద్ధపు హామీలు, మోసపూరిత గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్, కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, దళితబంధు వంటి అద్భుత పథకాలను విస్మరించి ప్రజలను నట్టేట ముంచిందని, వృద్ధాప్య పెన్షన్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు తులం బంగారం వంటి ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. రామగుండం గడ్డపై మళ్ళీ శాంతి వర్ధిల్లాలన్నా, పేదల ఆత్మగౌరవం కాపాడబడాలన్నా అది కేవలం విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ తోనే సాధ్యమని, ఈ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి, కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. రామగుండం అభివృద్ధికి మారుపేరుగా నిలిచిన కారు గుర్తునే జనం కోరుకుంటున్నారని, మాయమాటలు చెప్పే నాయకులను ఇంటికి పంపి, కేసీఆర్ మార్గదర్శకత్వంలో పనిచేసే బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.





## ఆలయాలు, స్కూళ్లు, ఆస్పత్రుల సమీపంలో మాంసం విక్రయాలకు బ్రేక్ - రాష్ట్రానికి హైకోర్టు సూచన



**హైదరాబాద్,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** ఆలయాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రుల నుంచి 100 మీటర్ల పరిధిలో మాంసం, నాన్‌వెజ్ ఆహార పదార్థాల విక్రయాన్ని నియంత్రించే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. భక్తుల మనోభావాలు, ప్రశాంతత, పరిశుభ్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను పరిగణనలోకి తీసుకొని స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని మున్సిపల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. మాంసం విక్రయ కేంద్రాల ప్రారంభానికి సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందే నిబంధనను విధానంలో చేర్చాలని హైకోర్టు సూచించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. హైదరాబాద్ రెడ్‌హిల్స్ ప్రాంతంలో తన మాంసం వ్యాపారాన్ని జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్, నాంపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ మహారాష్ట్రకు చెందిన బిపిన్ రాందాస్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు.

## రాజధాని పనుల్లో కీలక భాగస్వాములు కావాలి!

- మౌలిక వసతుల పనులకు మైన్స్ శాఖ కృషి అవసరం
- క్వారీ లీజుల దరఖాస్తులపై సమన్వయ శాఖలు దృష్టిపెట్టండి
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** నవ్య రాజధాని అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. మౌలిక వసతులకు సంబంధించిన పనుల వేగవంతానికి మైన్స్ శాఖతో పాటు రెవెన్యూ, అటవీ, పర్యావరణం వంటి సమన్వయ శాఖల కృషి కూడా కీలకమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధ్యక్షతన జిల్లాస్థాయి ప్రత్యేక కమిటీ సమావేశం జరిగింది. మైన్స్‌తో పాటు రెవెన్యూ, అటవీ, సీఆర్‌డీఏ, పర్యావరణం తదితర విభాగాల అధికారులు హాజరైన ఈ సమావేశంలో రాజధాని పనులు-జిల్లా సమన్వయ శాఖల భాగస్వామ్యం, ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలు, డిజైన్లతో రాజధాని నిర్మాణ పనులు చకచకా జరుగుతున్నాయని.. పర్యావరణహితంగా రహదారుల నిర్మాణాలకు విశేష కృషి జరుగుతోందని.. అయితే వీటి పనులకు అవసరమైన గ్రావెల్ వంటి వాటికి కొరత లేకుండా చూడాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతమున్న లీజులను సమీక్షించుకుంటూ కొత్తవాటి క్వారీ లీజుల దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. ఇందుకు మైన్స్ శాఖ.. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కూడిన బృందాలు జాయింట్ ఇన్‌స్పెక్షన్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో కార్యకలాపాలు చేపట్టాలని సూచించారు. కీలకమైన నిరభ్యంతర పత్రాల (ఎన్‌వోసీ) జారీకి రెవెన్యూ, అటవీ, పీసీబీ అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించాలని స్పష్టం చేశారు. రాజధాని అమరావతి అభివృద్ధి కీలకమైన ప్రాజెక్ట్ కావడంతో, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వ విధానాలు, చట్టాలు, పర్యావరణ నిబంధనలను పూర్తిగా పాటిస్తూ అభివృద్ధి పనులు ముందుకు సాగేందుకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ అంశాన్ని జిల్లా స్థాయిలో అత్యంత ముఖ్యమైన కార్యాచరణగా పరిగణించి అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ కుమార్, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, సీఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారి బి.శ్రీనివాసరావు, పీసీబీ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన గద్దర్ కుమార్తె వెన్నెల

**అమరావతి,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** ప్రముఖ ప్రజా గాయకుడు, విప్లవ కవి గద్దర్ కుమార్తె వెన్నెల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. ఏపీలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని, అలాగే ఆంధ్రా యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ కల్చరల్ విభాగానికి ఆయన పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వెన్నెల... తెలుగు సాంస్కృతిక రంగానికి, ప్రజా ఉద్యమాలకు గద్దర్ చేసిన సేవలను గుర్తు చేశారు. తమ విజ్ఞప్తులపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని వెన్నెల తెలిపారు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. గద్దర్ సేవలను గౌరవిస్తూ ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని నమ్మకంతో ఉన్నట్లు చెప్పారు.

## యాదవ మహాసభ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా కొలుసు మోహన్ యాదవ్



**విజయవాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** అఖిల భారత యాదవ మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీలో కీలక నియామకం జరిగింది. సంస్థ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (రాజకీయ వ్యవహారాల కమిటీ – పిఎసి ) చైర్మన్‌గా విజయవాడకు చెందిన ప్రముఖ నాయకులు కొలుసు మోహన్ యాదవ్ నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణరావు యాదవ్ మోహన్ యాదవ్‌కు నియామక పత్రాన్ని అందజేసి, బాధ్యతలు అప్పగించారు.?ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణరావు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యాదవులను రాజకీయంగా చైతన్యపరచడానికి, సామాజికంగా వారి హక్కుల కోసం పోరాడటానికి మోహన్ యాదవ్ అనుభవం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. రాబోయే రోజుల్లో యాదవ సామాజిక వర్గం రాజకీయంగా ఎదిగేందుకు ఈ కమిటీ దిశానిర్దేశం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. నూతన చైర్మన్ కొలుసు మోహన్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులకు మరియు కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యాదవుల ఐక్యత కోసం, వారి రాజకీయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సంఘం ప్రతినిధులు పాల్గొని మోహన్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు.

## ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించుదాం మన ఊరి బడిని మనమే కాపాడుకుందాం



**విస్సన్నపేట,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని ప్రభుత్వ బడులలో విద్యార్థులను చేర్పించుకుందాం మన ఊరి బడిని మనమే కాపాడుకుందాం అని ఎంపీడీవో చిన్న రాట్నాలు, ఎంఈఓ లు సుధాకర్ శంకరరావులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యు టి ఎఫ్ ఉపాధ్యాయ సంఘం, సిపిఎం సీనియర్ నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

## 150మంది విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు...





**గుడ్లవల్లేరు,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు ఏ ఏ ఎన్ ఎం అండ్ వి వి ఆర్ ఎస్ ఆర్ పాలిటెక్నిక్ కాలేజీలో 150మంది విద్యార్థిని విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు జరిగాయి. బుధవారం జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వై పి సి ప్రసాద్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసీజీ, కిడ్నీ, నేత్ర, దంత, చెవి, ముక్కు, గొంతు వైద్య పరీక్షలను అంధ్ర హాస్పిటల్స్ విజయవాడ వారిచే డాక్టర్ కామినేని అచ్యుతబాబు నేతృత్వంలో నిర్వహించారు. మేరుగు పెరుమాళ్ళు, లయన్స్ ప్రతినిధులు అడుసుమిల్లి వీరభద్రరావు, పి.చిట్టిబాబు పాల్గొన్నారు.

## 4,22,649 రూపాయలు సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ

**-మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు**



**విస్సన్నపేట,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో 8 కుటుంబాలకు సంబంధించి 4,22,649 రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాయల సుబ్బారావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.






## శరవేగంగా పరుగులు తీస్తున్న పెడన పట్టణ అభివృద్ధి...

● రూ.54 లక్షల అభివృద్ధి పనులను పరిశీలించిన కాగిత



**పెడన,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** గత వైసీపీ ప్రభుత్వం హయాంలో పూర్తి నిర్లక్ష్యం గురైన పెడన పట్టణ అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శరవేగంగా అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం టీడీపీ నాయకులతో కలిసి ఎన్టీఆర్ పార్క్ లో 15వ ఆర్థిక సంఘ నిధులు సుమారు రూ.11.36 లక్షలతో జరుగుతున్న వాకింగ్ ట్రాక్,సిట్టింగ్ బెంచెస్ వాల్ పెయింటింగ్ తదితర పనులను పరిశీలించారు అనంతరం డంపింగ్ యార్డులో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులు రూ.42.49 లక్షలతో బయో రెమిడేషన్ బయో మైనింగ్ ద్వారా లెగసీ వ్యర్థ భూమి పునరుద్ధరణ పనులను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పెడన పట్టణంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డు వేణుగోపాలరావు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర ద్వారా ఎన్నో సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్తను బయో రెమిడియేషన్ పద్ధతిలో 5900 మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను శుద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. పట్టణ ప్రజానీకానికి ఎంతో ఆహ్లాదం కలిగించే ఎన్టీఆర్ పార్క్ వైసీపీ పాలక వర్గం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని దీంతో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ వహించి సుమారు రూ.11 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేయడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, హన్ను, కమ్మగంటి వెంకటేశ్వరావు వాహబ్ ఖాన్, పూలబాబు,తమ్మా భీమయ్య పరసా జితేంద్ర వెలికట్ల ప్రసాద్ అనుముల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు

## ప్రారంభమైన శ్రీ సూర్య లక్ష్మీనారాయణ దేవాలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు





**విస్సన్నపేట,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో నరసాపురం గ్రామంలో శ్రీ సూర్య లక్ష్మీనారాయణ స్వామివారి దేవాలయంలో శ్రీ విశ్వా వసునామ సంవత్సరం మాఘమాసం శశిర ఋతువు ఉత్తరాయణం 4వ తేదీ బుధవారం బహుళ తదియ పుబ్బ నక్షత్ర యుక్త శుభలగ్నంలో వేద పండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో భక్తుల సమక్షంలో స్వామివారికి సంకలనం విగ్నేశ్వర పూజ, అంకురార్పణ,విశేష పూజలు నిర్వహించినట్లు ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు మార్గదర్శి అవార్డు గ్రహీత సుబ్రహ్మణ్యేశ్వర రావు గోటేటి మీడియా సమావేశంలో తెలియజేశారు. గురువారం శ్రీ సూర్య లక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణ ఉత్సవ మహోత్సవ కార్యక్రమాలు మరియు హోమశీ నిర్వహించబడుతుందని శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమం తో పాటు శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వారి శాంతి కళ్యాణోత్సవం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

## ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు




**కాకినాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ , కాకినాడ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం డా. బి.ఎస్. రావు మెమోరియల్ ఐఎంఎ హాల్, కాకినాడలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జి.ఆనంది , మూడవ అదనపు జిల్లా న్యాయ మూర్తి, కాకినాడ,జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులను ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఇటువంటి స్క్రీనింగ్ శిబిరాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు.క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రాముఖ్యతపై అవగాహన అతిథి గౌరవంగా హాజరైన డా. జె. నరసింహ నాయిక్ జిల్లా వైద్య,ఆరోగ్య అధికారత, కాకినాడ, మాట్లాడుతూ ప్రజలందరూ, ముఖ్యంగా ఆరోగ్య కార్యకర్తలు, తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ క్రమం తప్పకుండా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు.ఆరోగ్య కార్యకర్తల కోసం ప్రత్యేకంగా మెగా క్యాంపు ఈ ఉచిత మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఆరోగ్య కార్యకర్తల కోసం ప్రత్యేకంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే స్క్రీనింగ్ ప్రారంభమై,అధిక సంఖ్యలో ఆరోగ్య కార్యకర్తలు ఈ క్యాంపులో పాల్గొంటున్నారు. క్యాన్సర్ నిర్మూలనే లక్ష్యంగా ప్రతిజ్ఞ ఈ సందర్భంగా డా. ఎ.ఎల్. సత్యవతి, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్, ఐఎంఎ కాకినాడ, మాట్లాడుతూ రాబోయే కాలంలో క్యాన్సర్‌పై మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించి, కాకినాడ జిల్లాను క్యాన్సర్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, తాను సహా ఇతర గైనకాలజిస్టులు అందరూ కలిసి ఈరోజు సామూహికంగా ప్రతిజ్ఞ చేయడం జరిగింది. కాకినాడ జిల్లా ఆంధ్రప్రదేశ్‌లోనే కాక దేశానికి ఒక రోల్ మోడల్‌గా నిలవాలన్న ఆశయంతో ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆమె తెలిపారు. ఈ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని పలువురు ఎంతో మంచి పరిణామంగా, అభినందనీయమైన ముందడుగుగా కొనియాడారు ఈ కార్యక్రమంలో ఐఎంఎ కాకినాడ అధ్యక్షులు డా. కాదా వెంకట రమణ, కార్యదర్శి డా. ఎస్.సి.హెచ్.ఎస్.రామ కృష్ణ, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డా. ఎ.ఎల్.సత్యవతి తో పాటు సీనియర్ వైద్యులు,ఐఎంఎ సభ్యులు, వాలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించడం ద్వారా ప్రాణాలను కాపాడడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని ఐఎంఎ నాయకులు డా జీఎస్ మూర్తి,డా.బీవీ మహేష్,మోకా పవన్ కుమార్ తెలిపారు.

## ప్రతిభ కలిగిన సోషల్ మీడియా సభ్యులకు "బహుజన బందు" పురస్కారం చే సన్మానం

● ఏప్రిల్ 11 న అనంతపురం లో ఆర్.పి.ఎఫ్, & ఆర్.ఈ.ఎస్. ఆధ్వర్యంలో జరుగుతుంది. ● డా. పోతుల నాగరాజు



**అనంతపురం,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** రాష్టంలో, దేశంలో సోషల్ మీడియా పాత్ర చాలా గణనీయంగా పెరుగుతుంది. కారణం ప్రధాన పత్రిక లలోను. ఛానెల్ లలోను జరుగుతున్న వివక్ష,కుల తత్వం, అవినీతి, ఒక వర్గంకు, ఒక పార్టీకి, ఒక కులంకు, కొమ్ము కాస్తూ ప్రజల సంక్షేమము, అభివృద్ధి ని విస్మరించి కేవలం తమ ఆర్థిక అభివృద్ధి కోసం పాలక వర్గం తొత్తు గా పని చేస్తున్నాయనీ బి. సి.నేత డా.పోతుల నాగరాజు యాదవ్ అన్నారు.ఇలాంటి తరుణంలో సమాజం కోసం మేము సైతం అంటూ జర్నలిజం పట్ల ఆసక్తి ఉన్న వారు, చదువు కొన్న వారు, వాస్తవ విషయాలు తెలియ చేయాలని తపన ఉన్న వారు యూ ట్యూబ్ ఛానెల్ ను ఏర్పాటు చేసుకొని నిరంతరం సమాజం లో పని చేస్తున్నారు. వీరు తమ సొంత ఖర్చులతో ప్రయాణం చేస్తున్నారు. ఇలాంటి వారికీ తమ వంతు బాధ్యత గా ఒక చిన్న ప్రయత్నం మేము చేస్తున్నామన్నారు. నిజాయితీగాను, నిష్పక్ష పాతంగాను, పేదల సమస్య లపైన, బహుజన సమాజం పైన, చదువు కొన్న వారి కోసం, రైతుల పక్షాన పని చేస్తున్న, సమస్యల పరిష్కారం కోసం తమ వంతు బాధ్యత గా కృషి చేస్తున్న యూ ట్యూబ్ ఛానల్ సభ్యులను గుర్తించి వారికి "బహుజన బందు "పురస్కారం అందచేయడం జరుగుతుందనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంను రిజర్వేషన్ల పరిరక్షణ సమితి,మరియు రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్,మహాత్మా పూలే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టడం జరుగుతుందనీ, ఈ పురస్కారం కోసం ఉమ్మడి జిల్లాలు అనంత పురం, కడప, ,కర్నూల్, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లా లలో పని చేస్తున్న సోషల్ మీడియా ఛానల్ మిత్రులు మార్చి 25 వ తేది లోపుగా ఈ నెంబర్ లకు తమ ఛానల్ వివరాలు నమోదు చేసుకోవలసినది వారు విజ్ఞప్తి చేశారు. 9949928999, 9182018677, 8309475846 నెంబర్లకు వివరాలు పంపవలసినదిగా కోరారు.

## ప్రతిభ అవార్డ్ అందుకున్న ఎస్ ఐ సురేష్ ను సన్మానించిన హనుమాన్ జంక్షన్ ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్

**హనుమాన్ జంక్షన్ ఎస్ ఐ వెలుగుల సురేష్ ను సన్మానించిన ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు**




**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ ఎస్ ఐ గా వచ్చిన కొద్దికాలంలోనే వెలుగుల సురేష్ మంచి పేరు తెచ్చుకున్నారని అందుకే ఆయన్ను ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని హనుమాన్ జంక్షన్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చక్రపాణి విజయ్ కుమార్ అన్నారు. హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ వెలుగుల సురేష్ విధి నిర్వహణలోఅత్యుత్తమ ప్రతిభ కనబరిచినశీదుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగామచిలీపట్నం లో జిల్లా ఎస్ పి విద్యాసాగర్ నాయుడు, జిల్లా కలెక్టర్ బాలాజీ చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని హనుమాన్ జంక్షన్ ఫోటో గ్రాఫర్స్ ఆధ్వర్యంలో ఎస్ ఐ వెలుగుల సురేష్ ను బుదవారం పోలీస్ స్టేషన్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ తాడి రంగారావు మాట్లాడుతూ ఉన్నతమైన విలువలతో పోలీస్ డిపార్ట్మెంట్ పనిచేస్తున్న సురేష్ బావితరాలకు మార్గదర్శకులు కావాలని అన్నారు, ఈ కార్యక్రమంలో ఎస్ ఐ సురేష్ ను సన్మానించారు,చిరకాలం గుర్తుంచుకునే విధంగా అతి విలువైన జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ట్రజరర్ గంటా శ్రీనివాసరావు, సీనియర్ ఫోటో గ్రాఫర్స్ అంబళ్ళ వెంకట రంగారావు,మోగంటి వెశీకటేశ్వరరావు ( కొండ ) కళ్ళేపల్లి నారాయణ రావు, వేల్పూరి రంగబాబు,తవ్వా సురేష్,కర్ణికోట చిన్న, కోలపల్లి మల్లేశ్వరరావు,నోచర్ల అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు

## నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి 1.15 కోట్లు మంజూరు

● పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ నిధుల ద్వారా రహదారుల అభివృద్ధి

● ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** నియోజకవర్గంలో రోడ్డు అభివృద్ధికి కోటి 15 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. బుధవారం ఆమె తమ కార్యాలయంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ పరిధిలోని స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్ క్యాపిటల్ ఇన్వెస్ట్మెంట్ ఫండ్స్ ద్వారా ఈ నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా కంచికచర్ల రోడ్ నుండి బత్తినపాడు వరకు రహదారి అభివృద్ధికి 60 లక్షల రూపాయలు, సి ఎ డి ఆర్ అండ్ బి డ్ నుండి మున్నలూరు వరకు రహదారి అభివృద్ధికి 55 లక్షల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు.ఈ రహదారుల అభివృద్ధితో గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని, రైతులు, విద్యార్థులు, కార్మికులు సులభంగా రాకపోకలు సాగించగలరని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) లకు సంబంధిత మంత్రులు మరియు అధికారులకు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.త్వరలోనే పనులు ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆమె వెల్లడించారు.

## తిరుమలతో రాజకీయం చేస్తే వినాశనం తప్పదు

**-భాజపా జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి తొర్లికొండ**



**నందిగామ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** తిరుమలతో రాజకీయం చేస్తే వినాశనం తప్పదని ఎన్టీఆర్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి మాజీ నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కన్వీనర్ తొర్లికొండ సీతారామయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భగవంతుడు దగ్గర రాజకీయాలు చేస్తే భగవంతుడు ఎవరిని వదిలిపెట్టడు.గతంలో తిరుమల జోలికి వెళ్లిన వారి పరిస్థితులు మనం కళ్ళముందే చూసాము. హిందువుల ఆరాధ్య దైవం శ్రీ కలియుగ వెంకటేశ్వర స్వామి. హిందువుల మనోభావాలు దెబ్బ తినే విధంగా దేవుని చుట్టూ రాజకీయాలు చేయడం ఏమాత్రం బాగాలేదని ఈ సందర్భంగా సీతారామయ్య తెలియజేశారు.కోర్టు తీర్పు ప్రకారం లడ్డులో నెయ్యి కాకుండా కల్తీ పదార్థాలు వాడారని నివేదికలో స్పష్టంగా లిఖితపూర్వకంగా ఆదేశాలు వచ్చాయన్నారు. కానీ దీనిని ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేసి అనవసరమైన రాద్ధాంతాలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. కానీ మనమందరం రాజ్యాంగం అనుసరణలో ఉన్నాము. ఇట్లాంటి ఘటనలు రాజ్యాంగబద్ధంగా మంచి చెడులు నిర్ణయిస్తాయని తెలిపారు.రాష్ట్రం ఎన్డీఏ పరిపాలనలో ఎంతో సజావుగా జరుగుతుందని ప్రజలందరికి మంచి జరుగుతుందని. అనవసరమైన రాద్ధాంతాలు చేసి రాష్ట్రంలో అల్లకల్లాలు సృష్టించి ప్రజలను మభ్యపెట్టి ఇబ్బంది పెట్టవద్దని సీతారామయ్య ప్రకటనలో కోరారు.

## ప్రజల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి భరోసా

**46 మంది లబ్ధిదారులకు రూ.22.86 లక్షల చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే సౌమ్య**



**నందిగామ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** స్థానిక కాకాని నగర్‌లో గల ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలతో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా 46 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.22,86,435/- (ఇరవై రెండు లక్షల ఎనభై ఆరు వేల నాలుగు వందల ముప్పై ఐదు రూపాయలు) విలువైన చెక్కులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ,అనారోగ్యం, ప్రమాదాలు వంటి అనివార్య పరిస్థితుల్లో ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సమస్యలను ప్రజల దగ్గర నుంచి తెలుసుకుని, తక్షణ సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ల నాయకత్వంలో సంక్షేమ పాలన మరింత బలోపేతం అవుతోందని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మండవ కృష్ణకుమారి, లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు,కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఏసిబి అధికారుల చేతికి అవినీతి తిమింగలం



**కూకట్ పల్లి, ఫిబ్రవరి4 (వార్తాప్రభ):** కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సూపరి ఒడెంట్ ఇంజినీర్ పి. చిన్నా రెడ్డి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకి చిక్కాడు. ఏసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... కూకట్ పల్లి జోనల్ కమిషనర్ పరిధిలోని అల్వాల్, కూకట్ పల్లి, మూసాపేట్ సర్కిళ్లలోని చెరువులలో గుర్రపుడెక్క, పూడికతీత పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్ తనకు రావలసిన బిల్లుల కోసం సూపరిండెంట్ ఇంజినీర్ పి. చిన్నా రెడ్డిని సంప్రదించి తనకు రావలసిన కోటి 40 లక్షల రూపాయల బిల్లులను విడుదల చేయమని విజ్ఞప్తి చేశాడు. ఆ మొత్తాన్ని విడుదల చేసేందుకు తనకు 40 లక్షల రూపాయలు లంచం ఇవ్వాలని చిన్నా రెడ్డి డిమాండ్ చేయగా తాను అంత ఇచ్చుకోలేనని కాంట్రాక్టర్ తెలపటంతో 30 లక్షలకు తగ్గేది లేదని చిన్నా రెడ్డి తెలుపగా, తాను 30 లక్షలు సైతం ఒకే సారి ఇచ్చుకోలేనని విడతల వారిగా ఇచ్చేందుకు కాంట్రాక్టర్ సుముఖత వ్యక్తం చేశాడు. ఆ కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులకి ఫిర్యాదు చేయటంతో నేడు మొదటి విడతగా 15 లక్షల రూపాయలు, చిన్నా రెడ్డి వద్ద కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్న ప్రవీణ్ చేతికి అందజేస్తుండగా, ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రంగారెడ్డి రేంజ్ ఏసిబి డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపారు.

## బడ్జెట్ పాఠశాలలను కార్పొరేట్ ఫీజులతో చూడొద్దు

**ట్రస్మా అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి**



**కూకట్ పల్లి,ఫిబ్రవరి4(వార్తాప్రభ)**బడ్జెట్ పాఠశాలలను కార్పోరేట్ పాఠశాలలతో పోల్చి చూడవద్దని తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ట్రస్మా మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కార్యవర్గ సమావేశం ఓల్డ్ బోయిన్పల్లి లోని గ్రీన్ వుడ్ పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఫీజు రెగ్యులేషన్ కమిటీని తీసుకురావడంలో తప్పు లేదని కానీ కార్పొరేట్ ఫీజులను పరిగణలోకి తీసుకోవడమే బాధాకరమన్నారు. సామాన్యుల పిల్లలంతా బడ్జెట్ పాఠశాలల్లోనే చదువుతున్నారన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఇక్కడి పాఠశాలల్లో ఫీజులు అత్యధికంగా ఉండవని గుర్తు చేశారు. ప్రొఫెషనల్ టాక్స్, ట్రేడ్ టాక్స్ పేరుట ఇబ్బందులకు గురి చేయొద్దని విజ్ఞప్తి చేశారు. సమాచార హక్కు చట్టం పేరుతో, విద్యార్థి సంఘాల పేరుతో, ఇతర సంఘాల పేర్లతో పాఠశాలల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్న వారి నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారం పై ప్రభుత్వం దృష్టి సారించకపోతే ఆందోళనకు కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ ను, విద్యా సంస్థలకు సంబంధించిన పూర్తిస్థాయి జీవోలతో రూపొందించిన డైరీ ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిర్రు ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబు, బాలానగర్ మండల అధ్యక్షులు రమేష్ రెడ్డి, జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా బాధ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీలతో సమీక్ష

**నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు: 7,47,787**

**ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్ 2026)పై అవగాహన**

**పాల్గొన్న ఈఆర్వో శంకర్ సింగ్ మరియు ఎన్నికల అధికారులు**



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4, (వార్తాప్రభ) :** 045-కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026) ప్రక్రియపై బుధవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ డి. శంకర్ సింగ్ ఓటర్ల తాజా గణాంకాలను వెల్లడించారు. **కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి** పురుషులు 3,88,825, మహిళలు 3,58,797, థర్డ్ జెండర్ ఒక 165, మొత్తం ఓటర్లు 7,47,787 అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో తప్పుల సవరణకు ఈ ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో గాజులరామారం ఏఈఆర్వో ప్రమీల, జీడిమెట్ల ఏఈఆర్వో కె. సునీత, అలాగే దుండిగల్, బాచుపల్లి, కొంపల్లి ప్రాంతాల ఏఈఆర్వోలు పాల్గొన్నారు. ఎన్నికల సూపరింటెండెంట్ ఆర్. గిరిబాబు మరియు ఇతర రెవెన్యూ అధికారులు ఈ సమీక్షలో భాగస్వామ్యమయ్యారు.

## ఒక్క అవకాశం ఇవ్వండి వార్డును అభివృద్ధి చేసి చూపిస్తా

**కోదాడ ఫిబ్రవరి 4 (వార్తాప్రభ)** ఒక్క అవకాశం ఇవ్వండి ఆరవ వార్డు ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి మందా మౌనిక కోరారు.బుధవారం ఆరవ వార్డు లో ప్రతి వాడలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృ ద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు.

# నైతికత లేని నంగి వేషాలు!!

**● బుడుబుంగ పిట్టలా తేలుతున్న "సారు" ● అంగీలు మార్చినంత సులువుగా పార్టీల మార్పు ● అధికార దాహంతో డివిజన్ల మార్పు ● 41 చిత్రాల నట(రాజ)కీయం ● బాయ్‌కాట్ "ఆప్రదేశ్" లీడర్స్ అంటూ ట్రోల్స్**







**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 4 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరపాలక సంస్థ ఎన్నికల రణక్షేత్రంలో సిద్ధాంతాల కంటే స్వార్థ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ కొందరు నాయకులు ప్రదర్శిస్తున్న రాజకీయం ఓటర్లను విస్మయానికి గురిచేస్తోంది. పార్టీ కండువాలు మార్చడమే కాదు, గెలుపు గుర్రం ఎక్కేందుకు డివిజన్లను కూడా అంగీలు మార్చినంత సులభంగా మారుస్తున్న 'సారు' తీరు ఇప్పుడు నగరంలో చర్చనీయాంశమైంది. ఊసరవెల్లిలా రంగులు మారుస్తూ, ఏ తీరానికి ఆ తీరమే అన్నట్లుగా బుడుబుంగ పిట్టలా వ్యవహరిస్తున్న ఈ నట(రాజ) కీయుల నంగి వేషాలు 41 చిత్రాలను తలపిస్తున్నాయి. గతంలో పదవిలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను గాలికొదిలేసి, నేడు అవే సమస్యల పరిష్కారం కోసం వస్తున్నామనడం విడ్డూరంగా ఉంది. అప్పుడు చేసింది శూన్యం, ఇప్పుడు చేయబోయేది అసలే లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు. అభివృద్ధి మంత్రం పఠించాల్సిన నేతలు, గెలుపు కోసం 'లచ్చక్కల' (లక్షల రూపాయల) సంచులతో ఓటర్లకు గాలం వేస్తూ ప్రలోభాలకు గురిచేయడం ప్రజాస్వామ్యాన్ని వెక్కిరిస్తోంది. ఆ బడా నేత పగలు నీతులు చెప్తూ, రాత్రి వేళ క్వార్టర్ మందు సీసాల పంపిణీతో ఓటర్లను మత్తులో ముంచేందుకు బరితెగించారు. అభివృద్ధి మంత్రం పఠించాల్సిన చేతులతో మద్యం సీసాలను ఎరగా వేస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. గతంలో ఏమీ చేయని ఆ నాయకుడు, ఇప్పుడు గెలుపు కోసం మందు పంపిణీనే ప్రధాన అస్త్రంగా మార్చుకోవడం సిగ్గుచేటు. చీకటి పడగానే సందుల్లో సాగుతున్న ఈ చిల్లర రాజకీయం, ఆయన దిగజారుడు తనానికి పరాకాష్టగా నిలుస్తోంది. ఇలాంటి మద్యం పంపిణీతో ఓటర్లను లోబర్చుకోవాలని చూడటం రామగుండం ఆత్మగౌరవాన్ని కించపరచడమే. ఇలాంటి "ఆప్రదేశ్" లీడర్ల తీరుపై విసిగిపోయిన ప్రజలు సోషల్ మీడియా వేదికగా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. చిత్ర విచిత్రాలకు నిలయంగా మారిన రామగుండం మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఫిరాయింపుదారులు, నయవంచకుల ఆటలకు అడ్డుకట్ట వేయాలని ఓటర్లు నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది. సిద్ధాంత బలం లేని నాయకుల కంటే నిబద్ధత గల వారికే పట్టం కట్టాలని డివిజన్ల వ్యాప్తంగా చర్చ సాగుతోంది. నాడు నగరాన్ని పట్టించుకోని వారు నేడు డివిజన్ల బాట పట్టడం కేవలం అధికారం కోసమేనని స్పష్టమవుతోంది. ఇలాంటి వైఖరి నగర ప్రగతికి గొడ్డలి పెట్టుగా మారుతుందని మేధావులు హెచ్చరిస్తున్నారు.

# శ్రమశక్తి గర్జించాలి!!

**● కార్పొరేట్ కొమ్ముకాస్తున్న కేంద్రంపై సమరశంఖం ● కేంద్రం మెడలు వంచుదాం.. సమ్మెను గెలిపిద్దాం ● ఐఎఫ్టియూ నేత ఏ.వెంకన్న పిలుపు**



**పెద్దపల్లి/ సెంటినరీ కాలనీ: ఫిబ్రవరి 3 (వార్తాప్రభ ప్రతినిధి)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, కార్మికుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న 29 చట్టాలను కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమని ఎస్.సి.సి. డబ్ల్యూ.యు (ఐఎఫ్టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న మండిపడ్డారు. బుధవారం సెంటనరీ కాలనీలోని ఆర్జీ-3 పరిధిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.......విద్యుత్తు సవరణ చట్టం-2025, ఎల్ఐసీలో వంద శాతం విదేశీ పెట్టుబడులు వంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న చేపట్టే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికవర్గం ఉప్పెనలా కదిలి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హక్కులను హరిస్తూ, కార్మిక సంఘాలు లేని దేశంగా మార్చాలనే కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలని, శ్రమజీవుల ప్రతిఘటనతోనే ప్రభుత్వ మొండివైఖరి మారుతుందని ఆయన స్పష్టం చేశారు. ఐఎఫ్టీయూ నాయకులు మోహన్, రాకేష్, సురేష్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి సమ్మె బాట పట్టాలని ఐక్యంగా నినదించారు.

# క్యాన్సర్ ముందస్తుగా గుర్తిస్తే నయమయ్యే వ్యాధే

**ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ మల్లిక్ సింగరాజ్**



**మియాపూర్,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆర్బీఆర్ కాంప్లెక్స్ 4వ బ్లాక్‌లో మహిళలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిటిజన్ హాస్పిటల్,అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన రేడియేషన్ ఆంకాలజిస్ట్ డా.మల్లిక్ సింగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే పూర్తిగా నయమయ్యే వ్యాధి అని తెలిపారు.పొగాకు,మద్యపానంజంక్ ఫుడ్,వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని చెప్పారు.మహిళలు బ్రెస్ట్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.40 ఏళ్లు దాటిన వారు తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు,ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు,హాస్పిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజల అభివృద్ధే తన లక్ష్యం

**ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా**

**కాలనీ వాసులకు కాంగ్రెస్ నాయకులు పల్లపు సురేందర్ భరోసా**







**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ):**నల్లగండ్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లపు సురేందర్ మంగళవారం నల్లగండ్ల పరిధిలోని నేతాజీ నగర్,గుల్మొహర్ పార్క్,గోపనపల్లి తండా ప్రాంతాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మమేకమై, కాలనీల్లో ఎదురవుతున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.కాలనీల్లో రోడ్ల దుస్థితి,మౌలిక వసతుల లేమి,రేషన్ సదుపాయాల్లో ఇబ్బందులు, తాగునీటి సమస్య,పెన్షన్లకు సంబంధించిన అంశాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సమస్యలన్నింటినీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పల్లపు సురేందర్ హామీ ఇచ్చారు.గోపనపల్లి తండా కాలనీ వాసులు గతంలో సురేందర్ సొంత ఖర్చుతో రోడ్డు నిర్మాణం చేయించిన విషయాన్ని గుర్తుచేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, నల్లగండ్ల డివిజన్‌లోని ప్రతి కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే తమ బాధ్యత అని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటుందని, సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## బిజెపి నూతన అధ్యక్షుడు నితిన్ నబిన్ కు బిజెపి నేతల, శ్రేణుల ఘన స్వాగతం





**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ):**భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా తెలంగాణ రాష్ట్రానికి విచ్చేసిన నితిన్ నబిన్ కి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్,గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా జాతీయ అధ్యక్షుల పర్యటన కీలకమని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వరకు సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ స్వాగత కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర,జిల్లా,సీనియర్ నాయకులు,డివిజన్ నాయకులు,మహిళా నాయకులు,కార్యకర్తలు,అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సి.సి.రోడ్లు,డ్రైనేజ్ నిర్మాణాలు నాణ్యత తో వేగ వంతంగా పూర్తి చేయాలి

**కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి ఆదేశం**



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ):**చందానగర్ డివిజన్ పరిధిలోని శంకర్‌నగర్,సత్య ఎన్‌క్లేవ్,ఫ్రెండ్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు .డ్రైనేజీ,సీసీ రోడ్డు పనులు నాణ్యతతో,గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,కాలనీవాసులు పాల్గొన్నారు.

## కాషాయంతోనే ప్రగతి!!

**మోదీ ప్రభుత్వం దేశం కోసం**

**మున్సిపల్ ఎన్నికల్లో కమలమే వికసిస్తుంది**

**ప్రలోభాలకు, అబద్ధపు హామీలకు లొంగి మోసపోకండి**

**రామగుండం బిజెపి ఇంచార్జ్ కందుల సంధ్యారాణి**





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 4 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగర భవిష్యత్తు, సమగ్ర అభివృద్ధి కేవలం కాషాయ జెండాతోనే సాధ్యమవుతుందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కమలం వికసించడం ఖాయమని బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని బిజెపి అభ్యర్థులను కార్పోరేటర్లుగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.......ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశాభివృద్ధి కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని, అదే స్ఫూర్తితో రామగుండాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇతర పార్టీలు ఇచ్చే అబద్ధపు హామీలను, ఎన్నికల సమయంలో చూపే ప్రలోభాలను నమ్మి ప్రజలు మోసపోవద్దని, స్వచ్ఛమైన అలాగే అవినీతి రహిత పాలన కోసం బీజేపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర నిధులను మళ్లించి స్థానిక నాయకులు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రామగుండం పారిశ్రామిక ప్రాంత సమస్యల పరిష్కారానికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు బీజేపీ కట్టుబడి ఉందని, ప్రతి ఒక్కరూ దేశహితం కోరి కమలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

# ఎడిటోరియల్

## రాహుల్ ఎన్డీయేని ఇబ్బంది పెడుతున్నారా ?

కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడుగా రాహుల్ గాంధీ ఉన్నారు. గాంధీ వంశంలో ఈ రకమైన హోదాను ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీల తరువాత రాహుల్ గాంధీకి మాత్రమే వచ్చింది. అయితే ఇందిరా గాంధీ రాజీవి గాంధీ మొదట ప్రధానులుగా చేసి ఆనక ప్రతిపక్షంలోకి వచ్చారు. రాహుల్ విషయానికి వస్తే ఆయన ప్రధానిగా చేయలేదు, చాన్స్ వచ్చినా కాదనుకున్నారు, ఇక కేంద్ర మంత్రిగా కూడా ఆయన పని చేయలేదు. వెయిటింగ్ ప్రైమ్ మినిస్టర్ : 2004లో తొలిసారి ఎంపీగా గెలిచిన రాహుల్ గాంధీకి అధికారిక హోదా 2024 దాకా దక్కలేదు, కేబినెట్ హోదాతో కూడా లీడర్ ఆఫ్ అపొజిషన్ గా ఆయన ఉన్నారు. ఒక విధంగా చెప్పాలీ అంటే ఆయన వెయిటింగ్ ప్రేమ్ మినిస్టర్ గా ఉన్నారు. ఆయన ప్రధాని నరేంద్ర మోడీ ట్రజరీ బెంచీల వైపు ఉంటే అపొజిషన్ లో ఉండే నేతగా కనిపిస్తారు. అయితే రాహుల్ గాంధీ గత ఇరవై నెలలుగా లీడర్ ఆఫ్ అపొజిషన్ గా ఎంతవరకూ ఎన్డీయేని ఇరుకున పెట్టారు తాను ఎంతవరకు ఇరుకున పడ్డారు అంటే రెండూనూ అని చెప్పాల్సి ఉంటుంది. బీజేపీ టార్గెట్ గా : రాహుల్ గాంధీ బీజేపీని టార్గెట్ గా చేసుకుని మాట్లాడుతున్నారు అన్న భావన ఉంది. అపోజిషన్ లీడర్ అదే చేయాల్సి ఉంది. కానీ అది పూర్తిగా బాహాటంగా కనిపించకూడదు అదే లౌక్యమని అంటారు. మోడీ ప్రభుత్వం మీద అక్కసుతో ఆరోపణలు చేస్తున్నారు అన్నట్లుగా కాకుండా రాహుల్ చాకచక్యంగా వ్యవహరించడంలో ఇబ్బంది పడుతున్నారా అన్నది చర్చకు వస్తోంది. ఆయన లీడర్ ఆఫ్ అపోజిషన్ కాబట్టి తాను ఏదైనా మాట్లాడవచ్చు అనుకుంటున్నారని అందుకే విమర్శల పాలు అవుతున్నారని ఎన్డీయే వైపు నుంచి వస్తున్న మాట. అదే సమయంలో రాహుల్ గాంధీని కట్టడి చేయడానికి ఏకంగా ఎన్డీయేలో టాప్ లీడర్లు అంతా కలసి ముందుకు రావడం చూస్తూంటే ఆయన అధికార పార్టీని సైతం బాగానే ఇబ్బంది పెడుతున్నారు అని అర్థం అవుతోంది. ఇదిలా ఉంటే రాహుల్ గాంధీ గత సెషన్లలో ఓటు చోరీ అంటూ విమర్శలు సంధించారు. ఈసారి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంలో ఆయన చైనా భారత్ భూభాగం ఆక్రమణ అంటూ ఏకంగా ఎన్డీయే సర్కార్ ని ఉలిక్కి పడేలా చేశారు. అయితే ఈ ఇష్యూని ఆయన సరైన సందర్భంలో ప్రస్తావిస్తే బాగానే పేలేదని అంటున్న వారూ ఉన్నారు. కానీ రాహుల్ చెప్పేది ఏంటి అంటే రాష్ట్రపతి ప్రసంగంలో జాతీయ భద్రత అన్నది ఉంది కాబట్టి తాను ప్రస్తావించాను పైగా ఆధారసహితంగా తాను మాట్లాడుతున్నారు అని అంటున్నారు. స్పీకర్ తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని కూడా రాహుల్ ఆరోపిస్తూ తాజాగా స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. రాహుల్ గాంధీ ఏ ఇష్యూని ఎంచుకున్నా అభ్యంతరం అయితే లేదు, అదే సమయంలో సందర్భం చూసి గట్టిగా ఫోకస్ చేస్తే వచ్చే ఇంపాక్ట్ వేరే లెవెల్ లో ఉంటుందని అంటున్నారు. అదే సమయంలో బడ్జెట్ లో అనేక కీలక అంశాలు ఉన్నాయని ప్రజా సమస్యల గురించి ఆయన మాట్లాడితే మొత్తం 140 కోట్ల ప్రజల అభిమానం చూరగొంటారని అంటున్నారు. ఇక అధికార ఎన్డీయే మాత్రం రాహుల్ గాంధీ విషయంలో ఎంత లైట్ తీసుకోవాలని ప్రయత్నం చేస్తున్నా ఆయన గట్టిగానే ఉంటున్నారు అన్న మాట కూడా ఉంది. చూడాలి మరి ముందు ముందు ఏ విధంగా లీడర్ ఆఫ్ అపొజిషన్ తన వాడిని వేడిని చూపిస్తారో.

## మద్యం ప్రియుల్లారా.... తస్మాత్ జాగ్రత్త.....

**మద్యం సేవించి వాహనాలు నడిపితే ఇక జైలుకే.........**

**జరిమానా శాతం బాగా తగ్గించారు.ఏకంగా జైలుకే............**

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు అదేశాల మేరకు ట్రాఫిక్ డి.సి.పి.శ్రీమతి షిరీన్ బేగం పర్యవేక్షణలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 5వ ,2వ ట్రాఫిక్ పోలీసు వారి పరిధిలో పట్టుబడిన ఏడుగురు మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను ఆరవ ఆడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ లో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి లెనిన్ బాబు జరిమానా తో పాటుగా ఏకంగా జైలు శిక్షలు విధించారు.ఒకరికి 14 రోజులు. ఒకరికి 10 రోజులు.,ఇద్దరికి 8 రోజులు.,ఒకరికి 7 రోజులు.,ఒకరికి 4 రోజులు., మరొకరికి మాత్రమే రూ.15,000/- జరిమాన విధించారు.ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసులివతెలియజేస్తున్నారు.

## అక్కయ్య చెల్లికి హితవు



స్వార్ధపరులతో స్నేహము
ఎప్పటికైనా నష్టము
కృతజ్ఞత లేని వారికి
చేసిన సాయము వ్యర్థము
కడు జాగ్రత్త నోటితో
కలహాలు రేపుతుంది
నర రూప రాక్షసులతో
ముప్పు దాపురిస్తుంది
ఒకసారి మోసపోతే
ఉండాలి జాగ్రత్తగా
పదే పదే జరిగితే
మనదే పొరపాటుగా
సంస్కారవంతమైన
మాట తీరు అవసరము
అదే కదా ఏలుతుంది
ఇల హృదయ సామ్రాజ్యము

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు, ఎమ్మిగనూరు,సెల్:9966414580

## విఎంసి డైరీ ఆవిష్కరించిన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం ఉదయం తమ చాంబర్లో అధికారులతో విజయవాడ నగర పాలక సంస్థ డైరీను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఈ డైరీ మున్సిపల్ కార్పొరేషన్ సేవలన్నింటినీ సమగ్రంగా ప్రజలకు అందుబాటులోకి తేవడానికి రూపొందించబడిందని, నగరవాసులకు ఉపయోగపడే అన్ని ముఖ్యమైన సమాచారాన్ని ఇందులో పొందుపరిచారని తెలిపారు. వి ఎమ్ సి డైరీ ద్వారా ప్రజలకు మున్సిపల్ సర్వీసుల గురించి పూర్తి సమాచారం అందించారని, శుభ్రత, మౌలిక వసతులు, ఆరోగ్య, మరియు పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, ఎకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్ పాల్గొన్నారు.

## అవగాహనతో క్యాన్సర్ దూరం





**విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 4:(వార్తా ప్రభ ప్రతినిధి)**క్యాన్సర్ వ్యాధి పట్ల అనవసరమైన భయాందోళనలు తగ్గించుకుని, అవగాహనతో క్రమబద్ధమైన జీవితాన్ని అలవాటు చేసుకోవటం ద్వారా క్యాన్సర్ వ్యాధి తీవ్రత తగ్గించుకోవచ్చని, కొన్ని సందర్భాల్లో నివారణ కూడా సాధ్యమవుతుందని ప్రముఖ క్యాన్సర్ వ్యాధినిపుణులు డాక్టర్ అప్పాల సత్యశ్రీనివాస్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కె.బి.ఎన్. కళాశాల ఎన్.ఎస్.ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్త నిర్వహణలో డిగ్రీ విద్యార్థులకు క్యాన్సర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిగా నియంత్రించగలిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. శరీరంలో కారణం తెలియని బరువు తగ్గడం, దీర్ఘకాలంగా తగ్గని దగ్గు, మానని గాయాలు, అసాధారణ రక్తస్రావం, శరీరంలో గడ్డలు కనిపించడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని, ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పానీపూరి, బిర్యానీ వంటి జంక్ ఫుడ్స్, రోడ్ సైడ్ ఫుడ్స్ వల్ల క్యాన్సర్ సోకే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర మాట్లాడుతూ పొగాకు, మద్యం వంటి హానికర పదార్థాలకు దూరంగా ఉండాలని, పోషకాహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని తేలికగా నియంత్రించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ నానాటికీ పెరుగుతున్న కాలుష్యం, అనారోగ్యకరమైన జీవన విధానాల వల్ల క్యాన్సర్ వంటి అతిప్రమాదకరమైన వ్యాధులు వస్తున్నాయన్నారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఎన్.సాంబశివరావు, ఎం.శాంతిబాబు, పి.గౌతమీదేవి తదితరులు పాల్గొన్నారు.

## నిర్వహణ లోపంతో కళావిహీనంగా మారిన నగరపాలక సంస్థ కళ్యాణమండపం...

**విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు**





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని నాటి 29 డివిజన్, నేటి 44 డివిజన్‌లి లో నగరపాలక సంస్థ నిధులతో సుమారు 32 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కల్యాణమండపం నిర్వహణ లోపంతో ఎందుకు కొరగాకుండా నేడు శిథిలావస్థకు చేరుకుందని సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఎద్దేవా చేసారు. పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరిన కల్యాణమండపంను స్థానిక సిపిఐ పార్టీ డివిజన్ బృందం బుధవారం ఉదయం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భముగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గట్టు వెనుక పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉండే విద్యాధరపురం,లేబర్ కాలనీలో మరియు స్థానిక కొండప్రాంత ప్రజల అవసరాల నిమిత్తం డివిజన్ కమ్యూనిస్టు పార్టీ కార్పొరేటర్ గా నేను నగరపాలక సంస్థ కౌన్సిల్ నందు ప్రతిపాదన చేసి నిర్మాణానికి పూనుకోవడం జరిగిందని, స్థానిక ప్రజల అవసరాల నిమిత్తం నామమాత్రపు ధరకు అందరికి అందుబాటులో ఉండేవిదంగా కల్యాణమండప 2010 లో కల్యాణ మండపం నిర్మాణం గావించి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అప్పటి నుండి ఎటువంటి మరమత్తులకు నోచుకోక పావడంతో స్లాబు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొని అందుబాటులో లేని పరిస్థితి ఉన్నది అని,పేద ప్రజలకు అందుబాటులో ఉండాలని లక్ష్యంతో ఏర్పాటు చేసిన మా లక్ష్యాలను తూట్లు పొడుస్తూ పాలకుల వైఖరి కారణముగా నేడు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని,కనీసం ఎటువంటీ మౌలిక వసతులు లేక అందుబాటులో లేని కారణంగా స్థానిక పేద,మధ్యతరగతి ప్రజలు కార్యక్రమాల అవసరాల నిమిత్తం నేడు లక్షల రూపాయలు వెచ్చించి ప్రవేటు ఫంక్షన్ హాల్స్ ను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని వెంటనే నగరపాలక సంస్థ అధికారులు,44 వ డివిజన్ కార్పొరేటర్, ఎంఎల్ఏ గార్లు వెంటనే స్పందించి ఈ కల్యాణమండపం అభివృద్ధిపరచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు పంచదార్ల దుర్గాంబ,డివిజన్ కార్యదర్శి ఉప్పలపాటి శివప్రసాద రాజు, సహాయ కార్యదర్శులు ఎర్రసాని జోసెఫ్, అంజూరి సూరిబాబు, కోశాధికారి ఎ.వి.రంగారావు, పేర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ సూపర్ కప్ 2026 గెలుచుకున్న సిటాడెల్ గోదావరి లెజెండ్స్



**ఏపీ సూపర్ కప్--2026 ట్రోఫీ తో అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్ అభినందనలు అందుకుంటున్న గోదావరి లెజెండ్స్ ఆటగాళ్లు పృథ్వి, షాజెబ్, రాజేష్‌లు**

**అనంతపురం: ఫిబ్రవరి4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అనంతపురం ఆర్‌డీటీ స్టేడియంలో బుధవారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్‌లో సిటాడెల్ గోదావరి లెజెండ్స్ ఎఫ్‌సీ ఏపీ సూపర్ కప్ ఫుట్‌బాల్--2026ను సొంతం చేసుకుంది. అదనపు సమయం తర్వాత జరిగిన పెనాల్టీ షూటౌట్‌లో కోరమండల్ ఎఫ్‌సీపై 3--0 గోల్స్‌తో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్లు సమానంగా పోటీపడ్డాయి. నిర్దేశిత సమయంలోనూ, అదనపు సమయంలోనూ గోల్స్ నమోదు కాలేదు. దృఢమైన రక్షణాత్మక ఆటతో ఇరు జట్ల డిఫెండర్లు ప్రత్యర్థులకు స్పష్టమైన గోల్ అవకాశాలను ఇవ్వకుండా అడ్డుకున్నారు. దీంతో విజేతను నిర్ణయించేందుకు మ్యాచ్ పెనాల్టీ షూటౌట్‌కు చేరింది. పెనాల్టీ షూటౌట్‌లో సిటాడెల్ గోదావరి లెజెండ్స్ ఎఫ్‌సీ ఆటగాళ్లు అప్రమత్తంగా ఆడి మూడు పెనాల్టీలను గోల్స్‌గా మార్చారు. రాజా దేబ్‌నాథ్, విగ్నేష్ వెల్ మురుగన్, రమేశోర్ మీతే గోల్స్ సాధించారు. గోల్‌కీపర్ సచిన్ ఝా రెండు కీలక పెనాల్టీలను అడ్డుకొని జట్టు విజయంలో హీరోగా నిలిచాడు. ఈ విజయం ద్వారా సిటాడెల్ గోదావరి లెజెండ్స్ ఎఫ్‌సీ ప్రతిష్ఠాత్మక ఏపీ సూపర్ కప్‌ను గెలుచుకోవడంతో పాటు రూ.10 లక్షల ప్రైజ్ మనీని కూడా అందుకుంది. భారీ ప్రైజ్ మనీతో పాటు నాణ్యమైన పోటీ కారణంగా ఏపీ సూపర్ కప్ దేశంలోని ప్రముఖ ఫుట్‌బాల్ టోర్నమెంట్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ టోర్నమెంట్‌లో కోరమండల్, కొల్లేరు, పెన్నా, గోదావరి, విశాఖ, వంశధార, నల్లమల, తుంగభద్ర జట్లు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించిన ఈ ఎనిమిది జట్ల మధ్య రౌండ్ రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించి, అనంతరం నాకౌట్ దశల ద్వారా విజేతను నిర్ణయించారు. ఇది రాష్ట్రస్థాయి ప్రతిభకు మంచి వేదికగా నిలిచింది. ఈ విజయం సిటాడెల్ గోదావరి లెజెండ్స్ ఎఫ్‌సీ స్టార్ ఆటగాడు, సహ యజమాని పృథ్వికి వ్యక్తిగతంగా కూడా ఒక కీలక మైలురాయిగా మారింది. క్లబ్‌ను క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతలు చేపట్టిన ఆయన, సరైన ప్రాక్టీస్ మైదానాలు లేకపోవడం, స్పాన్సర్ల కొరత వంటి సమస్యలను ఎదుర్కొన్నారు. స్వంత పొదుపు ధనం వెచ్చించి, అప్పులు తీసుకుంటూ క్లబ్‌ను ముందుకు నడిపించిన ఆయన కృషి ఈ విజయంతో ఫలించింది. ఏపీ సూపర్ కప్ విజయం సిటాడెల్ గోదావరి లెజెండ్స్ ఎఫ్‌సీ పట్టుదల, జట్టు సమిష్టి శ్రమ, సంకల్పానికి నిదర్శనంగా నిలుస్తూ, మైదానం వెలుపల కూడా స్ఫూర్తినిచ్చే విజయగాథగా నిలిచింది.

## హయత్‌నగర్ డివిజన్‌లో అభివృద్ధి జోరు...రూ.83 లక్షలతో మూడు కాలనీల్లో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం.

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి.**



**ఎల్బీనగర్/వార్తప్రభ(ఫిబ్రవరి 4):**హయత్‌నగర్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శివశక్తి నగర్‌లో రూ.16.50 లక్షలు, సూర్య తేజ కాలనీలో రూ.23.50 లక్షలు, విద్యా నగర్ కాలనీలో రూ.43 లక్షల అంచనా వ్యయంతో నూతన సీసీ రోడ్ల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడమే తమ లక్ష్యమని, నాణ్యమైన మెటీరియల్‌తో బలమైన రోడ్లు నిర్మించి వర్షాకాల ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారంతో హయత్‌నగర్ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

## వడ్లాని మాధవరావు సతీమణి కాత్యాయనిని పరామర్శించిన జనసేన నాయకులు



**విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 4: (వార్తా ప్రభ ప్రతినిధి)**ఇటీవల మోకాలు మార్పిడి చికిత్స చేయించుకున్న బిజెపి నాయకులు వడ్లాని మాధవరావు సతీమణి కాత్యాయనిని జనసేన రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, జనసేన కృష్ణా పెన్నా ప్రాంత రీజనల్ కోఆర్డినేటర్ మల్లెపు విజయలక్ష్మి, జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా సెక్రెటరీ బండ్రెడ్డి రవీంద్ర, జనసేన ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రోగ్రాం కమిటీ మెంబర్ బొల్లేపల్లి కోటేశ్వరరావు, జనసేన 19వ డివిజన్ అధ్యక్షులు వటాల హరిప్రసాద్, జనసేన విజయవాడ సిటీ కార్యదర్శి శనివారపు శివ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని మాధవరావును అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

## ప్రపంచ కప్ పోటీల పతాక విజేత హనీత్ నాగ్

**గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం**



**గన్నవరం, ఫిబ్రవరి4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఢిల్లీ లో ఫిబ్రవరి 1 వ తేదీ నుండి 3 వ తేదీ వరకు జవహర్ లాల్ నెహ్రూ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన రెండవ షూటింగ్ బాల్ ప్రపంచ కప్ పోటీలలో రజత పతకం సాధించిన విజయవాడ వాసి హనీత్ నాగ్ కి బుధవారం గన్నవరం విమానాశ్రయంలో గన్నవరం వీఆర్ఓ రాకీబ్, పెద్దలు చైతన్య, సుధీర్, దావీదు,రెమల్లి రాజేష్ ,సాయి బాబు,సి.హెచ్.వెంకటేశ్వరావు, పాపట్ల రవి , సీనియర్ క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హనీత్ మీడియాతో మాట్లాతూ తాను గత 8 సంవత్సరాలనుండి నుండి షూటింగ్ బాల్ క్రీడను శిక్షకులు విజయ్ గోగులమూడి వద్ద శిక్షణ పొడుతూ శిక్షణ మాత్రమే కాకుండా పోటీలలో ఆర్థికంగా, మనో ధైర్యంగా అన్ని అన్నివిధాలా సహకరించరన అన్నారు. అనంతరం హనీత్ కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్, సంఘం సభ్యులకి, క్రీడాకారులకు, మీడియా వారికీ , పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## అమ్మ వారికి భక్తి, శ్రద్ధలతో మర్రి చెట్టు బోనం.

**పూల కప్పేరా తో ఊరేగింపు......**





.పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 4( వార్త ప్రభ) శ్రీ గోపయ్య స్వామి సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల సందర్భంగా నాలుగవ రోజు బుధవారం భక్తి శ్రద్ధలతో అమ్మవారికి మర్రి చెట్టు బోనం సమర్పించుట జరిగినది. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ చుంచు రమేష్ బాబు, కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.అలాగే సాయంత్రం శ్రీ అంకమ్మ అమ్మ వారికి పలు రకాల క్రతువులు నిర్వహించారు.. దీనిలో భాగంగా బైనీడు వారు ఒగ్గు కత్తులు చెపుతూ మర్రి చెట్టు వద్ద నుండి అమ్మ వారి ఆలయం వరకు పూల కప్పె ర తో ఊరేగింపు నిర్వహించిన్నారు..

## ఎంప్లాయీస్ సంఘ్ నేత సురేష్ కు సత్కారం



**ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 04(వార్తా ప్రభ ప్రతినిధి):** గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపు సంఘ్ కార్యాలయంలో డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ, బ్రాంచి కార్యదర్శి గద్దా సురేష్ ను బ్రాంచ్ అధ్యక్షుడు గూడవల్లి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ లెవెల్ లో సీఎస్ బీఎఫ్ మెంబర్ గా తనను ఎంపిక చేసినందుకు ఎన్ఎఫ్ఐఆర్ అండ్ ఎస్ సీఆర్ఈఎస్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్యకు, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్ కుమార్, జాయింట్ జనరల్ సెక్రటరీ భరణి భాను ప్రసాద్, వర్క్ షాప్ డివిజనల్ సెక్రటరీ అరుణ్ కుమార్, అధ్యక్షుడు ఇనాయిత్ పాషాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఎంప్లాయీస్ సంఘ్ పనిచేస్తుందన్నారు. కార్మికుల హక్కులు, రావలసిన నిధులు మంజూరు చేయించడంలో నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వర్కింగ్ చైర్మన్ దాసరి డేవిడ్ రాజు, కోశాధికారి పి.విమల్ సాయి, అసిస్టెంట్ సెక్రటరీలు పి.శివ నాగేశ్వరరావు, ఎస్.బోయాజ్, ఆర్.నాగమద్దయ్య, వైస్ చైర్మన్లు కూనిబిల్లి శంకరరావు, ఎ.కిషోర్ బాబు, పి.బి.సుబ్రహ్మణ్యం, బ్రాంచ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

# బ్లూ మీడియాలో వంద తప్పుడు కథనాలు రాసినా సరే.... కేసులు పెట్టినా భయపడేది లేదు

● అసభ్య పదజాలం వాడే వైసిపి నాయకుల ఇంటి ముందు శాంతియుతంగా ధర్నా చేస్తాం ● టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా వెల్లడి ● ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో మీడియా సమావేశం ● దేవినేని అవినాష్ వ్యాఖ్యలను ఖండించిన ఫతావుల్లా ● రాష్ట్రంలో మైనార్టీ నాయకులను అణగదొక్కేందుకు వైసిపి కుట్ర ● మైనార్టీ మహిళకు మాట్లాడే అర్హత లేదా? అంటూ ప్రశ్నించిన ఆషా ● వైసిపి నాయకుడు దేవినేని అవినాష్ ఓ గోడ మీద పిల్లి ● గుణదల దొడ్డికి పెట్రోల్ బాంబులు , బ్లేడ్ బ్యాచ్, రౌడీషీటర్లు బాగా పరిచయం ● ఎంపీ కేశినేని శివనాథ్ ను విమర్శించే స్థాయి వైసిపి నాయకులకు లేదు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బ్లూ మీడియా లో తమ పై వంద తప్పుడు కథనాలు రాసినా...కేసులు పెట్టినా భయపడేది లేదని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా తెలిపారు. ఇకపై వైసిపి నాయకులు ఎవరైనా సరే అసభ్య పదజాలంతో టిడిపి నాయకుల్ని విమర్శిస్తే...వారి ఇంటి ముందుకు వెళ్లి శాంతియుతంగా ధర్నా చేసి...అలా మాట్లాడం తప్పు అని తెలియజేస్తామని మహమ్మద్ ఫతావుల్లా స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఎంపీ కేశినేని శివనాథ్ పథకంతో జోగి రమేష్ ఇంటిపై తాము రౌడీషీటర్లు, బ్లెడ్ బ్యాచ్, ప్రెటోల్ బాంబులతో దాడి చేశామని ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడు దేవినేని అవినాష్ చేసిన వ్యాఖ్యలను టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా, రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా ఖండించారు. ఈ మేరకు బుధవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో మైనార్టీ నాయకులతో ఫతావుల్లా మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఫతావుల్లా మాట్లాడుతూ తమ నాయకులు సీఎం చంద్రబాబు, నారా లోకేష్ లను అసభ్య పదజాలంతో తిడుతున్న వారి ఇంటి ముందు శాంతియుతంగా నిరసన తెలియజేసే అర్హత ముస్లిం మైనార్టీ నాయకుడిగా తనకు లేదా అంటూ వైసిపి నాయకులను సూటిగా ప్రశ్నించారు. వైసిపి రాష్ట్రంలో ముస్లిం నాయకత్వం ఎక్కడ వుండకూడదు..ఎదగకూడదనే దురాలోచన వుందన్నారు. వైసిపి లో ఇప్పటి కే ముస్లిం నాయకత్వాన్నిమొత్తం తొక్కేశారన్నారు.తెలుగుదేశం పార్టీలో వున్న ముస్లిం నాయకత్వాన్ని భయపెట్టేందుకు వారి బ్లూ మీడియా పత్రికలో తప్పుడు కథనాలు రాస్తున్నారని మండిపడ్డారు. ముస్లిం నాయకుడు, ముస్లిం నాయకురాలకు ధర్నా చేసే అర్హత లేదా అంటూ ప్రశ్నించారు. .. వైసిపి నాయకుల తప్పులను టిడిపి లోని మైనార్టీ నాయకులు ప్రశ్నిస్తే...బ్లూ మీడియ పత్రికలో ఇష్టం వచ్చినట్లు రాయించటం ఒక అలవాటుగా మారిందన్నారు.తామంతా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలమని....సీఎం చంద్రబాబు, నారా లోకేష్ , ఎంపీ కేశినేని శివనాథ్ మనుషులమని...ఏనాడు తాము టిడిపి కాదని చెప్పలేదన్నారు.. బ్లూ మీడియా పత్రికలో ఇలాంటి వంద తప్పుడు కథనాలు రాయించినా సరే....తాము భయపడేది లేదన్నారు. అధికారంలో వస్తే ఏదో చేసేస్తామని వైసిపి నాయకులు చెబుతున్నారు. వాళ్ల ప్రగల్బాలకు భయపడేది లేదని... ప్రాణం ఇచ్చే వాడు అల్లా...ప్రాణం తీసుకునే వాడు అల్లా అని తాము ఆ భగవంతుడికి తప్ప ఎవరికి భయపడేది లేదన్నారు.బ్లూ మీడియా పత్రికలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ , ఎంపీ కేశినేని శివనాథ్ లతో దిగిన పోటోలు ప్రచురించారు ...తాము వైసిపి నాయకుల కి కానీ, దేవినేని అవినాస్ కానీ ఎక్కడైనా, ఎప్పుడైనా ఎంపీ కేశినేని మనుషులం కాదనీ, టిడిపి కార్యకర్తలం కాదని ఏరోజైనా చెప్పామా అంటూ సూటిగా ప్రశ్నించారు.సీఎం చంద్రబాబు తో ప్రయాణించే టిడిపి కార్యకర్తలమన్నారు. నారా లోకేష్ తోపాటు ఎంపీ కేశినేని శివనాథ్ నాయకత్వాన్ని బలపర్చిచే నాయకులమన్నారు. తాము కాదంటే మీరు ఈ పోటోలు చూపించాలన్నారు.ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైయస్సార్ పార్టీని ఛీ కొట్టడంతో ఏదోక విధంగా మీడియా లో కనిపిస్తుండాలనే ఉద్దేశ్యంతో అధికార పార్టీ పై, నాయకులపై ప్రతి రోజు నిందలు వేస్తూ మనుగడ సాగించాలనే ఆలోచనతో వైసిపి నాయకత్వంలో వుందన్నారు. అందుకే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్ లపై అసభ్య పదజాలంతో అంబటి రాంబాబు , జోగి రమేష్ వంటి వైసిపి నేతలు ఇష్టం వచ్చినట్లు నోరుపారేసుకుంటున్నారన్నారు.జోగి రమేష్ ఇంటి ముందు శాంతియుతంగా ధర్నా చేస్తే...దాడి చేసినట్లు మాట్లాడుతున్న వైసిపి నాయకుడు దేవినేని అవినాష్ కి మానవత్వం, కనీస జ్ఞానం, మహిళలను గౌరవించే లక్షణం వుంటే వైసిపి నాయకులు మాట్లాడిన భాషను వ్యతిరేకించాలన్నారు. ఇలాంటి భాష మాట్లాడే వైసిపిని బంగాళఖాతంలో ముంచారని..ఆ భాషను మాట్లాడొద్దని జోగి రమేష్, అంబటికి హితవు చెప్పకుండా, శాంతియుతంగా ధర్నా చేయటానికి వెళ్లిన తమపై దాడి చేసినట్లు అసత్య ఆరోపణలు చేయటం దేవినేని అవినాష్ చేసే కుట్ర పూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు.దేవినేని అవినాష్ చరిత్ర మాట్లాడానికి చాలా వుందని, గతం మర్చిపోయి ఎంపీ కేశినేని శివనాథ్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. పచ్చ కామెర్ల వున్నవాడికి లోకం అంతా పచ్చగా కనబడినట్లు...ఎంపీ కేశినేని శివనాథ్ రెండేళ్లుగా విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి కనిపించటం లేదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ నచ్చటం లేదని, కబ్జాలు, ఇసుక, మట్టి, బూడిద లతో అక్రమ వ్యాపారం చేసే మాఫియా నాయకులే దేవినేని అవినాష్ నచ్చుతారని ఎద్దేవా చేశారు. దేవినేని అవినాష్ కుటుంబ చరిత్ర అందరికీ తెలుసన్నారు.తెలుగుదేశం పార్టీ దేవినేని అవినాష్ కు రాజకీయ భిక్ష పెడితే...గోడ మీద పిల్లిలా మారి వైసిపి నాయకుడి అవతారమెత్తాడన్నారు. సీఎం చంద్రబాబు, ఎంపీ కేశినేని శివనాథ్ ల గురించి మాట్లాడే స్థాయి అవినాష్ కు లేదన్నారు. నారా లోకేష్ తో కారులో తిరుగుతూ , సీఎం చంద్రబాబు తో దిగిన పోటోలు చూసుకోవాలని...గతం మర్చిపోకూడదన్నారు. దేవినేని నేహ్రూ తెలుగుదేశం జెండా కప్పుకునే చనిపోతా అన్నారు. ఆయన మాటలకు వ్యతిరేకంగా దేవినేని అవినాష్ ప్రవర్తించటంతో పాటు పయనిస్తున్నారన్నారు.ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ కరీముల్లా మాట్లాడుతూ తమ నాయకులపై మాజీ మంత్రి జోగి రమేష్ అసభ్యపదజాలంతో మాట్లాడినందుకు నిరసనగా శాంతియుతంగా ధర్నా చేయటం జరిగిందన్నారు. తాము టిడిపి కార్యకర్తలమే కాదు...సీఎం చంద్రబాబు కుటుంబసభ్యులమన్నారు.తమ వల్ల పార్టీకి, నాయకులకి ఎలాంటి అపవాదు రాకూడదనే శాంతియుతంగా ధర్నా చేయటం జరిగిందన్నారు. టిడిపి తల్చుకుంటే గూగుల్ మ్యాప్ లో కూడా వైసిపి అడ్రస్ కనపడదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రజలు ఏది చెబితే అది నమ్మే పరిస్థితిలో లేరన్నారు.టిడిపి ప్రతిపక్షంలో వున్న ప్పుడు ఏనాడు ఇలాంటి అసభ్య పదజాలం వాడలేదన్న విషయం పులివెందుకు ఎమ్మెల్యే వై.ఎస్. జగన్ గ్రహించాలన్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గురించి మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదన్నారు.టిడిపి రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా మాట్లాడుతూ దేవినేని అవినాష్ ఎన్టీర్ జిల్లా వైసిపి అధ్యక్షుడు కాదని, ఎన్టీఆర్ జిల్లా గుండా అన్నారు. తాము ట్వంటీ ఫోర్ బై సెవెన్ ఎంపీ కేశినేని శివనాథ్ అనుచరులమని బల్ల గుద్ది చెప్పారు. టిడిపి కార్యకర్తలం కాదని తాము ఎక్కడ అనలేదన్నారు. తాము జోగి రమేష్ ఇంటిపైదాడికి వెళ్లలేదంటూ...కేవలం శాంతియుతంగా ధర్నా చేయటానికి మాత్రమే వెళ్లినట్లు స్పష్టంచేశారు. పెట్రోల్ బాంబుల గురించి, బ్లెడ్ బ్యాచ్, రౌడీ షీటర్ల తో గుణదల దొడ్డికి బాగా పరిచయం వుందన్నారు. గత ప్రభుత్వంలో వైసిపి నాయకుడు వెల్లంపల్లి అమ్మవారి గుడిలో వెండి విగ్రహాలు బంగారం దోచుకున్నాడన్నారు. పట్టాభి ఇంటి పై, టిడిపి కార్యాలయం పై దాడి చేసినప్పుడు ఆడవారు, పిల్లలు, ఉద్యోగులు వుంటారని గుర్తుకు రాలేదా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 420 ఎవరో అందరికీ బాగా తెలుసునని, గుగూల్ ని అడిగితే క్లియర్ గా చెబుతుందన్నారు. వైసీపీ నాయకులు సీఎం చంద్ర బాబు నాయుడు, మంత్రి లోకేష్, ఎంపీ కేశినేని చిన్ని గురించి అసత్య ఆరోపణలు చేస్తూ మాట్లాడితే వాళ్ళ ఇంటి ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో టిడిపి ఈస్ట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ కరీమ్, పశ్చిమ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు నసీమా, ప్రధాన కార్యదర్శి పితాని పద్మ, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి నూరుద్దీన్, పశ్చిమ నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ , తెలుగుదేశం నాయకులు ఇర్ఫాన్, అలీ, నజీబ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో 'వార్త ప్రభ టీఎస్-2026' క్యాలెండర్ ఆవిష్కరణ.





ఎల్బీనగర్/వార్త ప్రభ (ఫిబ్రవరి 4:చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో బుధవారం వార్త ప్రభ టీఎస్--2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సిఐ సైదులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వార్త ప్రభ విలేఖరి వి.బి.రుషి, లయన్స్ క్లబ్ కొత్తపేట అధ్యక్షుడు లయన్ డాక్టర్ విజయ రంగ, కిట్టు,సీఐ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. దినపత్రికలు వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావడంతో పాటు ప్రజలు--ప్రభుత్వం మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు.

## ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్ నివారణ - జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం ఫిబ్రవరి4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ముందస్తు వైద్య పరీక్షలతో క్యాన్సర్ ను అరికట్టగలమని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారు.బుధవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ, మచిలీపట్నం జిజిహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని కోనేరు సెంటర్ నుండి బెల్ కంపెనీ వరకు వైద్య కళాశాల విద్యార్థులు, వైద్యాధికారులు, వైద్యులు తదితరులతో కలసి నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఖైనీ గుట్కా నమలొద్దు.. క్యాన్సర్ బారిన పడొద్దు, ముందస్తు పరీక్ష .. క్యాన్సర్ కు రక్ష, కలిసి పోరాడుదాం.. క్యాన్సర్ ను ఓడిద్దాం అంటూ జిల్లా కలెక్టర్ వారి చేత పలు నినాదాలు చేయిస్తూ ర్యాలీగా సాగారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, నివారించడం, చికిత్స చేయడం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పాటిస్తామని తెలిపారు.క్యాన్సర్ దేశంలో అతి వేగంగా వ్యాప్తి చెందుతున్న ప్రమాదకరమైన జబ్బు అని పేర్కొంటూ అసంక్రమిత వ్యాధులు (నాన్-కమ్యూనికేబుల్ డిసీజెస్) అంటే ఒక వ్యక్తి నుండి మరొకరికి నేరుగా సంక్రమించని గుండె జబ్బులు, క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మధుమేహం వంటి వ్యాధులలో ఇది ప్రథమ స్థానంలో ఉందన్నారు. ముందస్తు పరీక్ష ద్వారా ఈ క్యాన్సర్ ను అరికట్టగలమని చెబుతూ, తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ బారిన పడితే గనుక అభివృద్ధి చెందిన అత్యాధునిక వైద్య చికిత్స పద్ధతులతో రోగి జీవితకాలం గణనీయంగా పెంచవచ్చన్నారు. అలాకాకుండా అవగాహన రాహిత్యంతో క్యాన్సర్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరిస్తూ తొలి దశలోనే గుర్తించి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషి, బెల్ కంపెనీ వారి సౌజన్యంతో క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం ఒక ప్రత్యేక మొబైల్ బస్సును ఏర్పాటు చేశామని, ఇది ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లోని గ్రామాలలో 31 ప్రాంతాలలో తిరిగి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా ఇప్పటి వరకు దాదాపు రెండు వేలకు పైగా వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 110 మందిని హయ్యర్ సెంటర్ కు రిఫర్ చేయడం జరిగిందని, వారిలో 28 మందికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, వ్యాధి చివర దశలో ఉన్న వారందరికీ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్ ఎం ఓ డాక్టర్ నిరంజన్, నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వరలక్ష్మి, ఎంబిబిఎస్ కళాశాల వసతి గృహ వార్డెన్ డాక్టర్ నవీన్ చౌదరి, వైద్య కళాశాల విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో తీవ్ర విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

**విద్యుత్ అధికారులకు బీజేపీ నాయకుల వినతి**



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 4(వార్తాప్రభ):** కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని 248 వెంకటేశ్వర నగర్‌తో పాటు హనుమాన్ నగర్, దినబంధు కాలనీ, ప్రగతి నగర్, పాపిరెడ్డి నగర్, అస్బెస్టస్ కాలనీ తదితర బస్తీల్లో గత కొంతకాలంగా తీవ్రమైన విద్యుత్ సమస్యలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో పాటు, మధ్యాహ్నం మరియు సాయంత్రం సమయాల్లో అనిశ్చితంగా విద్యుత్ కోతలు పడుతున్నాయి. ఈ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం చిన్నపిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయంలో, ఉద్యోగులు ఆఫీసులకు బయలుదేరే వేళ విద్యుత్ లేకపోవడం వల్ల నిత్యజీవితం అస్తవ్యస్తంగా మారింది. ఈ సమస్యలపై బుధవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందజేశారు.బీజేపీ పార్టీ డివిజన్ అధ్యక్షులు బాలు యాదవ్,బండ కుమార్, ప్రశాంత్, శ్రీకాంత్ యాదవ్‌తో పాటు ఇతర బీజేపీ నాయకులు కలిసి ఈ లేఖను సమర్పించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరారు.వినతి పత్రాన్ని స్వీకరించిన విద్యుత్ అధికారులు సానుకూలంగా స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

## రాష్ట్రంలో బీసీలకు రక్షణ కరువైంది

**జై గౌడ్ సంఘం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు**
**జోగి రమేష్ కు మద్దతుగా నిలుస్తామన్న గౌడ సంఘం నేతలు**



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4 (వార్తా ప్రభ ప్రతినిధి):** రాష్ట్రంలో అప్రజాస్వామిక పాలన సాగుతుందని జై గౌడ్ సంఘం జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావు గౌడ్ ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో టీడీపీ నేతల దాడికి గురైన మాజీ మంత్రి జోగి రమేష్ నివాసాన్ని జై గౌడ్ సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. జోగిని పరామర్శించి అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల నేత ఇంటిపై దాడిని చూస్తుంటే ప్రజాస్వామ్యంలో ఉన్నామా? అనే అనుమానం కలుగుతుందన్నారు. టీడీపీ నేతల దాడిని జై గౌడ్ సంఘం పార్టీలకు అతీతంగా ఖండిస్తుందన్నారు. రాజకీయాల్లో ప్రశ్నిస్తారు.. విమర్శిస్తారు.. పోరాడతారని, అంతమాత్రాన ఇంటిపై దాడి చేసి నిప్పు పెడతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒక మాజీ మంత్రి ఇంటిపై దాడి చేస్తే.. ఇక సామాన్య కల్లుగీత కార్మికుడి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? గౌడలకు హక్కులు ఉండవా? ప్రశ్నించొద్దా? ఇది దుర్మార్గపు చర్య అని అభిప్రాయపడ్డారు. ఏ రాష్ట్రంలో, ఏ ప్రాంతంలో ఇంత దుర్మార్గం లేదన్నారు. దాడి చేసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు గూండాల పక్కన నిలబడితే సామాన్యుల పరిస్థితి ఏమిటి ? రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? ప్రజాస్వామ్యం ఉందా? గవర్నర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కనీసం సామాజికవర్గం సమావేశం కూడా పెట్టనివ్వడం లేదన్నారు. గీత కార్మికులు ప్రమాదాల్లో చనిపోతే ఎక్స్‌గ్రేషియా చెల్లించడం లేదన్నారు. రెండు రాష్ట్రాల్లో కోటి జనాభా ఉన్న గౌడలకు బడ్జెట్ లో ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దౌర్భాగమన్నారు. బీసీలే వెన్నెముక అంటున్న టీడీపీ బీసీ గౌడ బిడ్డ ఇంటిపై పెట్రోల్ బాంబుతో దాడి చేయడం రాజ్యాంగమా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పాలన చేయకుండా కులాల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. మీ దుశ్చర్యలు మానుకోవాలని, గౌడ బిడ్డల జోలికొస్తే ఊరుకునేది లేదని, అండగా ఉండి ఐక్యంగా పోరాడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జై గౌడ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, తెలంగాణ జై గౌడ్ సంఘం అధ్యక్షుడు గుంట్రాతి నారాయణ గౌడ్, మహారాష్ట్ర జై గౌడ్ సంఘం అధ్యక్షుడు నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపిన బుక్ కీపర్ తంగెళ్ళమూడి కోటేశ్వరమ్మ



**గన్నవరం: ఫిబ్రవరి4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గన్నవరం మండలం, చిక్కవరం గ్రామంలోని సమత గ్రామైక్య సంఘం బుక్ కీపర్ పీకా నరసమ్మ అక్రమాలకు పాల్పడటంతో, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, వెలుగు అధికారులను ఆదేశించిన నేపథ్యంలో విచారించి, ఆమెను తొలగించడం జరిగింది. అనంతరం సమత గ్రామైక్య సంఘం నూతన బుక్ కీపర్ గా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆశీస్సులతో తంగెళ్ళమూడి కోటేశ్వరమ్మ ను నియమించడం జరిగింది. అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో తొలగించిన పీకా నరసమ్మ మళ్ళీ తను బుక్ కీపర్ గా కొనసాగడానికి అనేక ప్రయత్నాలు చెయ్యడంతో పాటు గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులను సైతం బెదిరించి, తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో పీకా నరసమ్మ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ను కలసి తనకు అన్యాయం జరిగిందని, మళ్ళీ తనకు బుక్ కీపర్ గా కొనసాగడానికి సిఫార్సు చెయ్యాలని కోరడం జరిగింది.

## క్యాన్సర్ కు ధైర్యమే మందు

**- కెయూ లో అవగాహన సదస్సులు**



**మచిలీపట్నం ఫిబ్రవరి4 :(వార్తా ప్రభ ప్రతినిధి)** క్యాన్సర్ రాకుండా ముందుస్తు జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా ఆహారపు అలవాట్లు లో క్రమశిక్షణ అవసరం అని వక్తలు ఉద్బోధించారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భముగా కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ విభాగాల ఆధ్వర్యములో బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, ఇంజనీరింగ్ కళాశాల, ఫార్మసీ కళాశాలలో వేర్వేరుగా అవగాహన సదస్సు లు నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ లో నిర్వహించిన సదస్సులో బయోటెక్నాలజీ విభాగం సహాయ ఆచార్యులు డా ఎల్. సుశీల క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు పై వివరించారు. ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ క్యాన్సర్ తొలి దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే నివారణ సులభం అన్నారు. ఇంజనీరింగ్ కళాశాల లో నిర్వహించిన సదస్సులో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారీ కవిత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం శ్రావణి, ఆచార్య మారుతి, డా. సల్మా, డా. శేషా రెడ్డి, డా. శాంతికృపా, రంగమణి విద్యార్థులు పాల్గొన్నారు.

## నకిలీ నోట్ల తయారీ ముఠా అరెస్ట్.





**మచిలీపట్నం ఫిబ్రవరి4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దొంగ నోట్ల మార్పిడి ముఠా ను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా ఎస్పీ మాట్లాడుతూ కృత్తివెన్ను మండలం సంఘముడి గ్రామంలో వైన్ షాప్ నందు ఫిబ్రవరి 2వ తేదీ ఇద్దరు వ్యక్తులు రెండు 500 రూపాయలు నకిలీ నోట్లు తీసుకువచ్చి మద్యం కొనుగోలు చేశారు అని, అనంతరం వైన్ షాప్ యజమాని నోట్లు పరిశీలించగా నకిలీ నోట్లను గుర్తించి వాటిపై కృత్తివెన్ను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పై కేసు నమోదు చేసిన దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.. నకిలీ నోట్ల ముఠా పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఉపయోగించి ముద్దాయిలను పట్టుకున్నామని ఎస్పీ వివరించారు.ముద్దాయిల వివరాలను పెందుర్తి మండలం కోకావానిపాలెం గ్రామం కు చెందిన తోమండ్ర రంజిత్ సింగ్ బ్రహ్మ ఉమా శంకర్ , దిలీప్ ,పాశం రాజశేఖర్ అని తెలిపారు. ముద్దాయిలు గతంలో గంజాయి కేసు ,నాలుగు నకిలీ నోట్ల కేసులో నమోదయ్యాయి అని అన్నారు. ముద్దాయిలు కోకామని పాలెం గ్రామంలో ఇల్లు అద్దెకు తీసుకొని నకిలీ నోట్ల ప్రింటింగ్ చేస్తున్నట్లు వివరించారు. ముద్దాయి వద్ద నుండి 6,2,400 విలువ చేసే నకిలీ నోట్లను, 6000 రూపాయలు ఒరిజినల్ క్యాష్ ను, నకిలీ నోట్ల తయారు చేసే యంత్రాలను, మూడు సెల్ ఫోన్లు, హుండాయ్ శాంట్రో కారును స్వాధీనం చేసుకొని సీజ్ చేసామన్నారు.కృష్ణాజిల్లాలో ఎవరైనా అక్రమంగా నకిలీ నోట్లో ముద్ర వేసిన నకిలీ నోట్లో మార్చిన నకిలీ నోట్లు కలిగి ఉన్న వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఏమైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## వృద్ధురాలి హత్య కేసులో సంచలన నిజాలు

**24 గంటల్లోనే నిందితురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు**
**బంగారం కోసమే దారుణం.. బండరాయితో మోది హత్య**
**సాంకేతిక ఆధారాలతో నిందితురాలు కవిత చిక్కిన వేళ**
**సమష్టిగా పనిచేసిన దుండిగల్ పోలీస్, సీసీఎస్ మరియు ఎస్ఓటీ బృందాలు**



**దుండిగల్, ఫిబ్రవరి 4, (వార్తాప్రభ)** : దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు కేవలం 24 గంటల వ్యవధిలోనే ఛేదించి తమ సమర్థతను చాటుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మేడ్చల్ డివిజన్ ఏసీపీ సీ.హెచ్. శంకర్ రెడ్డి బుధవారం దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. చర్చి గాగిలాపూర్‌కు చెందిన చిన్నబత్తిని సుశీలమ్మ (85) అనే వృద్ధురాలు తన నివాసంలో ఒంటరిగా ఉంటున్నారు. ఇదే గ్రామానికి చెందిన పి. కవిత (36) అనే మహిళ గతంలో మృతురాలి ఇంట్లో 15 రోజుల పాటు మేస్త్రీ పని చేసింది. సుశీలమ్మ ఒంటరిగా ఉంటున్న విషయాన్ని గమనించిన నిందితురాలు, ఆమె వద్ద ఉన్న బంగారంపై కన్నేసింది. ఈ నెల 2వ తేదీ మధ్యాహ్నం సుశీలమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో.. నిందితురాలు కవిత ఆమె తలపై బండరాయితో బలంగా మోది కిరాతకంగా హత్య చేసింది. అనంతరం ఒంటిపై ఉన్న బంగారు చెవి కమ్మలు, ఉంగరాన్ని దొంగిలించి పరారైంది.

**పోలీసుల వేగవంతమైన దర్యాప్తు** కేసు నమోదు చేసుకున్న పోలీసులు (Cr.No:108/2026), మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. సాంకేతిక ఆధారాలు మరియు సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, మంగళవారం రాత్రి 9:30 గంటల సమయంలో నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుండి దొంగిలించిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన దుండిగల్ ఇన్‌స్పెక్టర్ పీ. సతీష్, డీఐ బాలరెడ్డి, సీసీఎస్ ఏసీపీ నాగేశ్వరరావు మరియు ఎస్ఓటీ బృందాలను ఏసీపీ అభినందించారు. అలాగే, నిందితురాలిని గుర్తించడంలో సహాయపడిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసిన స్థానిక నివాసి శ్రీకర్ రెడ్డి ని పోలీసులు ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆయనను సన్మానించనున్నట్లు తెలిపారు.

## "వార్తా ప్రభ" నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ):**ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉంటూ నిత్య నూతన కథనాలతో అంచెలంచెలుగా ప్రజాదరణ పొందుతున్న "వార్తాప్రభ" దిన పత్రిక నూతన క్యాలెండర్ ఆవిష్కరించుకోవడం అభినందనీయమని మియాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి అన్వర్ షరీఫ్ అన్నారు.బుధవారం "వార్తాప్రభ" పత్రిక నూతన క్యాలెండర్ 2026ను మియాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి అన్వర్ షరీఫ్ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎం.డి అన్వర్ షరీఫ్ మాట్లాడుతూ.. "వార్తాప్రభ" వార్తా పత్రిక నిత్యం ప్రజా సమస్యలు ప్రస్తావిస్తూ ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి సమస్యలు చేరవేస్తూ అనేక కథనాలతో సమాజహితమై పనిచేస్తుండటం అభినందనీయమని,అంచెలంచెలుగా అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన పత్రికలలో వార్తాప్రభ ఒకటిగా నిలుస్తుందని,ఇదేవిధంగా మరింత ప్రజాదరణ పొందాలని,ప్రజలకు ప్రభుత్వాలకు వారదిగా మన్ననలు అందుకుంటూ అన్ని విభాగాల విశిష్ట కథనాలను పాఠకులకు అందజేస్తూ వార్తాప్రభ ప్రాచుర్యం పొందాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వార్తాప్రభ సీనియర్ జర్నలిస్టు రాజు,స్థానిక పాత్రికేయులు,స్థానిక నాయకులు,బండారు మహేందర్ ముదిరాజ్,భాస్కర్ తదితరులు ఉన్నారు.

## సిద్ధి వినాయక హిల్స్ కాలనీలో అభివృద్ధి బాట..రూ.19 లక్షలతో సీసీ రోడ్లకు శంకుస్థాపన.

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**



**ఎల్బీనగర్/ వార్త ప్రభ(ఫిబ్రవరి 4):**బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సిద్ధి వినాయక హిల్స్ కాలనీలో రూ.19 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు స్థానిక జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధి కోసం మంజూరైన నిధులతో రోడ్ల పనులు త్వరలో ప్రారంభమవుతాయని, దశలవారీగా కాలనీలోని అన్ని సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## అసంపూర్తి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయండి.

**జోనల్ కమిషనర్ కు ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ రాగం వినతి**



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు,చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే తో పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ,కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పెండింగ్,అసంపూర్తి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని, నిధులు మంజూరు చేసి పనుల్లో వేగం పెంచాలని, రోడ్ల మరమ్మత్తులు,చెరువుల సుందరికరణ,గుర్రపు డెక్క తొలగింపు, పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలని పిఏసీ చైర్మన్ సూచించారు.ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# రాజకీయాల్లో అరుదైన దృశ్యం!!

● ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఉదారత ● ముందు సేవకులమే...తర్వాతే నాయకులం ● మానవత్వమే మా నినాదం ● ఓట్ల వేట కాదు.. ఇది పేదల కష్టాలను తీర్చే బాట ● 13వ డివిజన్‌లో హృదయాలను గెలుచుకున్న స్వాతి ప్రవీణ్



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 4 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరపాలక సంస్థ 13వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి కటుకు స్వాతి ప్రవీణ్ తన ఉదారతను చాటుకుని ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. "ముందు సేవకులమే.. ఆ తర్వాతే నాయకులం" అనే నినాదంతో ముందుకు సాగుతున్న ఆమె, ప్రచార సమయంలో ఒక నిరుపేద రోగి పడుతున్న ఇబ్బందులను చూసి చలించిపోయారు. తక్షణమే స్పందించిన స్వాతి ప్రవీణ్, సదరు రోగికి అవసరమైన ఆరు నెలల మందులను సొంత ఖర్చులతో ఉచితంగా అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రాజకీయాలంటే కేవలం ఓట్లు, ప్రసంగాలు మాత్రమే కాదని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన నాయకత్వమని ఆమె నిరూపించారు. మానవత్వమే మా నినాదం అని ఓట్ల వేట కాదు.. ఇది పేదల కష్టాలను తీర్చే బాట అని నిరూపించిన తీరు అమోఘం. ఈ ఊహించని సేవా కార్యక్రమంతో డివిజన్ ప్రజలు ఒక్కసారిగా ఫిదా అయ్యారు. ప్రచార ఆర్భాటాల కంటే ప్రజా సేవకే మొగ్గు చూపుతున్న స్వాతి ప్రవీణ్ తీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. నిరుపేద కుటుంబానికి ఆమె చేసిన ఈ సాయం 13వ డివిజన్ ఓటర్లలో బలమైన ముద్ర వేసింది. సాధారణ అభ్యర్థిగా కాకుండా ఒక ఆపద్బాంధవిగా ప్రజల కష్టాల్లో పాలుపంచుకుంటున్న ఆమె వైఖరి ఇప్పుడు నగరవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్వచ్ఛమైన సేవా దృక్పథంతో సాగుతున్న ఆమె ప్రచారం ఇతర అభ్యర్థులకు ఆదర్శంగా నిలుస్తోంది.

# ప్రజాపాలనే భరోసా!!

● రామగుండంలో క్లీన్ స్వీప్ చేస్తాం ● ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళు ● కాంగ్రెస్ మాట ఇస్తే అది అభయహస్తమే ● సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్ సహకారంతో రైసింగ్ రామగుండం ● ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 4 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్లలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ప్రజాపాలనే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... రాబోయే ఎన్నికల్లో రామగుండంలో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తూ, ప్రజల సంక్షేమం అలాగే నియోజకవర్గ అభివృద్ధి తమ ప్రభుత్వానికి రెండు కళ్ళ వంటివని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుల పూర్తి సహకారంతో "రైసింగ్ రామగుండం" పేరుతో ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా, మౌలిక సదుపాయాల పరంగా అగ్రగామిగా నిలుపుతామని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే అది పేదల పాలిట అభయహస్తమని, గత ప్రభుత్వాల వైఫల్యాలను తుడిచిపెట్టి పారదర్శకమైన పాలన అందిస్తున్నామని ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, అభివృద్ధి పనుల్లో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా పనిచేసి రామగుండం కోటపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతూ.....స్థానిక సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం అందుబాటులో ఉంటానని రాజ్ ఠాకూర్ భరోసా కల్పించారు

# నేత్ర, అవయవ దానాలు మానవ మనుగడకు మహోపకారం!!

● మరణానంతరం మరో నలుగురికి ప్రాణదాతలు అవుదాం ● మరణించినా జీవిద్దాం.. 50 మంది సింగరేణి ఉద్యోగుల అవయవదాన ప్రతిజ్ఞ ● సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చౌడవరపు లింగమూర్తి



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 4 (వార్తాప్రభ ప్రతినిధి)**నేత్ర, అవయవ అలాగే శరీర దానాలు మానవ మనుగడకు మహోపకారమని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చౌడవరపు లింగమూర్తి అన్నారు. బుధవారం ఆర్జి-2 విటిసి-2లో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మనిషి మరణానంతరం కూడా మరొకరికి జీవనాన్ని ప్రసాదించే గొప్ప అవకాశం దానాల ద్వారా లభిస్తుందని, సమాజ హితం కోరి ప్రతి ఒక్కరూ ఈ బృహత్తర కార్యంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. లింగమూర్తి మాటలతో స్ఫూర్తి పొందిన దాదాపు 50 మంది సింగరేణి ఉద్యోగులు, అప్రెంటిస్ అభ్యర్థులు స్వచ్ఛందంగా తమ అవయవాలను దానం చేసేందుకు ముందుకు రావడం విశేషం. ఈ సందర్భంగా దాతలందరికీ మేనేజర్ సురేష్ చేతుల మీదుగా డోనర్ కార్డులను పంపిణీ చేశారు. మానవత్వంతో స్పందించి ముందుకు వచ్చిన దాతలను ఫౌండేషన్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ విశ్వనాథ్ రెడ్డితో పాటు విటిసి అధ్యాపక బృందం కూడా పాల్గొని దానాల ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులు, సిబ్బందిలో సామాజిక బాధ్యతను పెంచేందుకు ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతో దోహదపడతాయని వారు అభిప్రాయపడ్డారు. చివరగా దాతలు తమ నిర్ణయంతో సమాజానికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసిస్తూ కార్యక్రమాన్ని ముగించారు.

# ఆమనగల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి.



**ఎల్బీనగర్/వార్తప్రభ (ఫిబ్రవరి4):**ఆమనగల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి వేగం పెంచారు. వార్డుల ఇంచార్జిలతో కలిసి పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానిక సమస్యలను తెలుసుకున్న ఎమ్మెల్యే.. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పేర్కొన్నారు. పట్టణ ప్రగతి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్ : 12 వాహనాల సీజ్

**రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై ఉక్కుపాదం**
**కౌసల్య కాలనీ వద్ద వాహనాల తనిఖీ**
**సీజ్ చేసిన వాహనాలు బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగింత**




**బాచుపల్లి, ఫిబ్రవరి 4, (వార్తాప్రభ) :** నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు బుధవారం రాంగ్ సైడ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. మియాపూర్ పరిధిలోని కౌసల్య కాలనీ యూ-టర్న్ వద్ద ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, ఎస్.ఐ.పి విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ సైడ్‌లో ప్రయాణిస్తున్న 11 ద్విచక్ర వాహనాలు మరియు ఒక ట్రాక్టరు, మొత్తంగా 12 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. అనంతరం తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఈ వాహనాలను బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం వల్ల తోటి వాహనదారుల ప్రాణాలకు ముప్పు కలుగుతుందని, ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు.

## ఆమనగల్ మున్సిపల్ ఎన్నికలు...కాంగ్రెస్‌తోనే మున్సిపల్ అభివృద్ధి సాధ్యం.

**- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి.**



**ఎల్బీనగర్ / వార్త ప్రభ, (ఫిబ్రవరి4):**ఆమనగల్లు పట్టణ మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే అది కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణాన్ని అన్ని రంగాల్లో 'స్ట్రాంగ్'గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ లో శివారు కాలనీల అభివృద్ధే లక్ష్యం..

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.**




**ఎల్బీనగర్/ వార్తప్రభ(ఫిబ్రవరి4):**ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సిరిహిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ పనులు, డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. శివారు కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు తన పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే అభినందిస్తూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిటిజెన్ కో ఆపరేటివ్ సొసైటీ



**మల్కాజిగిరి : ఫిబ్రవరి4 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సిటిజెన్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ మల్కాజ్ గిరి బ్రాంచ్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో బుధవారం వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమములో జెడ్ ఆర్ యు సీసీ సభ్యులు నూర్ , వై. శంకరరావు , ఏ.వీ స్వామి పాల్గొనగా టీ వీ ఎస్ సూర్య నారాయణ కేక్ కట్ చేశారు. 2600 మంది సభ్యుల్లో 125 కోట్ల వ్యాపారంతో ఖాతాదారుల మన్ననలు పొందుతోందని బ్రాంచి మేనేజరు ఎస్. ఎం పీరాన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అనిల్ కుమార్, హర్ష కుమార్, ప్రియాంక, దినేష్, తాన్యా, శారద తదితరులు పాల్గొన్నారు.

# భారీగా పెరిగిన రూపాయి విలువ

అంతర్జాతీయ మార్కెట్లో ఒడిదుడుకులు, డాలర్ బలపడటం వంటి కారణాలతో కొంత కాలంగా నెల చూపులు చూసిన రూపాయి విలువ భారీగా పెరిగింది. భారత్ -అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం దేశీయ కరెన్సీకి కొత్త ఊపిరి పోసింది. ట్రేడింగ్లో రూపాయి విలువ అమెరికా డాలర్ తో పోలిస్తే 119 పైసలు పెరిగి 90.30 వద్ద స్థిరపడింది. అమెరికా విధిస్తున్న సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయమే ఈ భారీ పెరుగుదలకు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్లో రూపాయి 90.30 వద్ద ప్రారంభమైంది. ఇది సోమవారం నాటి ముగింపు (91.49) కంటే 119 పైసలు ఎక్కువ. సుంకాల తగ్గింపుతో అంతర్జాతీయ మార్కెట్లో భారత్ బలోపేతం కావడంతో, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తిరిగి భారతీయ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఫారెక్స్ ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. ఈ సానుకూల వార్తతో దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా భారీ లాభాల్లో ఉన్నాయి. సెన్సెక్స్ 2,138 పాయింట్లు (2.62 శాతం ), నిఫ్టీ 607 పాయింట్లు (2.42శాతం) మేర పెరగడంతో రూపాయి విలువ కూడా పెరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న పరిస్థితులపై ఫిన్రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్ ఎల్ఎల్పి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్ భన్సాలీ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సుంకాలు 18 శాతానికి తగ్గడం భారతీయ ఎగుమతిదారులకు అంతర్జాతీయ స్థాయిలో గొప్ప ఆధిక్యాన్ని అందిస్తుందని తెలిపారు. దాదాపు 9 నెలల నిరీక్షణ తర్వాత వచ్చిన ఈ ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి అంగీకరించింది. దీనివల్ల అమెరికా గతంలో విధించిన 25 శాతం అదనపు శిక్షార్హమైన సుంకాలను కూడా తొలగించింది. సుంకాల్లో తగ్గుదల, బలపడుతున్న రూపాయి వల్ల దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు తగ్గి, దేశంలో ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ పరిణామంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మళ్లీ భారత మార్కెట్ల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని ట్రేడర్లు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా బలంగా ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 2,138 పాయింట్లు (2.62 శాతం), నిఫ్టీ 607 పాయింట్లు (2.42 శాతం) లాభపడటంతో రూపాయికి మరింత మద్దతు లభిస్తున్నట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి.భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తర్వాత అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న పరిస్థితులపై ఫిన్రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్ ఎల్ఎల్పి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ కుమార్ భన్సాలీ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సుంకాలు 18 శాతానికి తగ్గడం వల్ల భారతీయ ఎగుమతిదారులకు ప్రపంచ మార్కెట్లో స్పష్టమైన పోటీ ప్రయోజనం లభిస్తుందని చెప్పారు. సుమారు తొమ్మిది నెలల నిరీక్షణ అనంతరం ఈ ఒప్పందం కుదరడం భారత ఆర్థిక వ్యవస్థకు అనుకూలంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపివేయడానికి భారత్ అంగీకరించినట్లు సమాచారం. దీనికి ప్రతిగా అమెరికా గతంలో విధించిన 25 శాతం అదనపు శిక్షార్హ సుంకాలను కూడా ఉపసంహరించింది. సుంకాల తగ్గుదలతో పాటు రూపాయి బలపడటం వల్ల దిగుమతి వస్తువుల ధరలు తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా దేశంలో ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావడానికి ఇది దోహదపడుతుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



**ఇస్కా రాజేష్ బాబు,**
**సీనియర్ జర్నలిస్ట్ ,**
**93973 99298**

# భారత ఆరోగ్య వ్యవస్థలో మహిళా డాక్టర్లు కీలకం..



**గుడివాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా ది గుడివాడ మహిళా వాకర్స్ అసోసియేషన్ మరియు తెలుగు మహిళా అసోసియేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ సుగుణవతి గారిని శాలువాలతో సత్కరించి పూలమాలలతో అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ది గుడివాడ మహిళా అధ్యకు రాలు ఎం. దీవెన, సెక్రటరీ వి. ప్రతిమ, ట్రెజరర్ ఎం. కృష్ణ కుమారి మరియు తెలుగు మహిళా అధ్యక్షురాలు వై. సుధా రాణి, సెక్రటరీ శైలజ, ట్రెజరర్ ఈశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీవెన, సుధారాణీ లు మాట్లాడుతూ నేటి భారతదేశ వైద్యరంగంలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగిందన్నారు. మాతృ, శిశు మరణాల రేటు తగ్గుదలలో మహిళా వైద్యులు కీలక పాత్ర పోషించారనీ తెలిపారు. కొవిడ్ టైమ్‌లో ప్రాణభయాన్ని లెక్కచేయ కుండా.. రాత్రింబవళ్లు ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తించిన మహిళా వైద్యులు సేవాస్ఫూర్తికి ప్రతిరూపాలుగా నిలిచారన్నారు. మహిళా వైద్యుల సేవలను గౌరవించడమే కాకుండా, వారి సమస్యలకు స్పష్టమైన పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత సమాజంపై ఉందనీ అన్నారు.

# ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత..

## –మున్సిపల్ కమీషనర్ మనోహర్..



**గుడివాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధి, పరిశుభ్రత మరియు ప్రజల ఆరోగ్య భద్రతకు పురపాలక సంఘం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ తెలిపారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ 8వ వార్డు మరియు 11వ వార్డులను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా 8వ వార్డులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించి, డ్రైనేజీపై ఉన్న అక్రమ ఆక్రమణలను తొలగించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే వార్డులోని మంచినీటి సరఫరా పరిస్థితిని కూడా ఆయన సమీక్షించారు. అనంతరం 11వ వార్డులో పూడిక పేరు కుపోయి నీటితో నిండిన ఒక ఓపెన్ సైట్‌ను పరిశీలించి, అక్కడ నిలిచి న నీటిని తొలగించి ప్రజారోగ్య సమస్యలు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలన కార్య క్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సతీష్ చంద్ర, అసిస్టెంట్ ఇం జనీర్ (ఏఈ) రాజేష్, సంబంధిత సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాంగణ నియామకాలలో ఆదిత్య డిగ్రీ విద్యార్థుల జయభేరి




**గుడివాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** ప్రాంగణ నియమకాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల గుడివాడ విద్యార్థులు జయభేరి మోగించారని ప్రిన్సిపల్ రవీంద్ర బాబు తెలిపారు. ఆదిత్య కళాశాల లో జరిగిన ప్రాంగణ నియమకాల్లో 32 మంది విద్యార్థులు అల్డిజి టెక్ కంపెనీ లో ముగ్గురు విద్యార్థులు ఏకాగ్రత లో ఎంపిక అయ్యారు అని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరి గానే ఈ సంవత్సరం కూడా ఆదిత్య విద్యార్థులు తమ హవా చూపించారని అన్నారు ఇంకా డిగ్రీ అవ్వకుండా 6 వ సెమిస్టర్ లో ఉండగానే, విద్యార్థులు సెలెక్ట్ అయ్యారని తెలియచేసారు. ఇంకా పలు కంపెనీలు వరుసగా ఉన్నాయని, వాటిలో ఉద్యోగాలు సాధించటం కోసం విద్యార్థులకు మంచి శిక్షణ ఇస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని తెలియచేసారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, సెక్రటరీ సుగుణ రెడ్డి, అకాడమిక్ డైరెక్టరు నాయుడు అభినందించారు మరియు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆలియ బేగం, టిపిఒ బి రాము అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

# ఘనంగా యాన్యువల్ సైన్సు ఎగ్జిబిషన్ ప్రారంభం



**కాకినాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** స్థానిక జగన్నాధపురం ఎపెక్స్ పాఠశాలలో మంగళవారం యాన్యువల్ సైన్సు ఎగ్జిబిషన్ ప్రారంభించారు. పాఠశాల డైరెక్టరు ఎంఎ బేగ్ మాట్లాడుతూ సైన్సు ప్రాజెక్టుల వలన విద్యార్థులలో సృజనాత్మకత పెరిగి విజ్ఞానాభివృద్ధి కలుగుతుందన్నారు. అది విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులతో, పాఠ్య ప్రణాళిక ఆధారంగా పాఠ్యాంశాలకు సంబందించిన చిన్న, చిన్న నాటకాలు ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల నైపుణ్యాలను తిలకించి సంతోషించారు. 10వ తరగతి విద్యార్థులతో ఫుడ్ కోర్ట్ నిర్వహించారు. ప్రాజెక్టుల రూపకల్పనలో ఉపాధ్యాయుల సూచనల ద్వారా సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతమైంది. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు డైరెక్టర్ బేగ్ అభినందనలు తెలిపారు.

# "ద్వార బంధాల చంద్రయ్య నాయుడు" నాటికకు లక్ష రూపాయల నగదు బహుమతి..

## • అందుకున్న ఆర్.వి.ఎల్. నరసింహారావు బృందం



**గుడివాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** విశ్వవిఖ్యాత నటనా సార్వభౌమ డాక్టర్ ఎన్టీ రామారావు కళాపరిషత్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో నాటిక పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ద్వార బంధాల చంద్రయ్య నాయుడు నాటికకు మాజీ మంత్రి, ఎన్టీఆర్ పెద్దల్లుడు డాక్టర్ దగ్గుపాటి వెంకటేశ్వరావు చేతుల మీదగా మంగళ వారం రాత్రి 9 గంటలకు ఒంగోలులో జ్ఞాపిక మరియు లక్ష రూపాయలు నగదు బహుమతి ను ద్వారబంధాల చంద్రయ్య నాయుడు పాత్రధారి ఆర్.వి.ఎల్. నరసింహారావు మరియు బ్రిటిష్ పాత్రధారులు వై ప్రణీత్, యాకోబు వారి టీం అందుకోవటం జరిగింది. ఎన్టీఆర్ కళా పరిషత్, ఒంగోలు లో 'ద్వారబంధాల చంద్రయ్య నాయుడు' నాటిక కు ఉత్తమ ప్రదర్శన ఎంపికైనందుకు టీం సభ్యులందరికి మరియు కృష్ణా ఆర్ట్స్ తరపున అవార్డు మరియు లక్ష రూపాయల నగదు బహుమతినీ అందుకున్న చంద్రయ్య నాయుడు పాత్రధారి ఆర్.వి. ఎల్. నరసింహరావు "వార్తా ప్రభ"తో మాట్లాడుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సమిష్టి విజయానికి కారకులైన రచయిత పి.వి. సత్యనారాయణ కి, యువ దర్శకుడు కృష్ణహితేష్, నటీ నట వర్గం లో చంద్రయ్య పాత్రధారి ఆర్.వి.ఎల్. నరసింహరావు అనే తను, నాగన్న పాత్రధారి జె.నాగేశ్వరరావు, లక్ష్మణస్వామి పాత్రధారి శౌంతి శ్రీనివాస్, పాలేరు పాత్రలో కటికం వెంకటేశ్వరరావు, పర్వీన్ దొర పాత్రలో నాగసాయి, మరో బ్రిటీష్ దొరగా ప్రణీత్, దొంగ పాత్రలో లోయ రాధాకృష్ణ, మీసాల ఈరన్న దొర పాత్రలో యలమర్తి కోటేశ్వరరావు, పురోహితుడు పాత్రలో కిరణ్ కుమార్, బ్రిటీష్ సైనికులు గా విజయకుమార్, యాకోబు, దుర్గారావు, మరదాని వెంకటేశ్వరరావు, బాల చంద్రయ్య, బాలరంప వీరులుగా నటించిన చిరంజీవులకు, నాయకురాలు గరిమెళ్ళ మంగమ్మ పాత్రలో కుమారి.కుసుమా, బాల నటీమణులు పవిత్ర, జెన్నీసా.. అందరూ అభినందనీయులన్నారు. అదే విధంగా మంచి సంగీతాన్ని అందించిన సాయితేజ, మేకప్ శేషగిరి , అందరికి పేరు, సమిష్టి విజయానికి ఇది గొప్ప నిదర్శనమన్నారు.. ఒక్క మాటలో చెప్పాలంటే ఇందులో నటించిన అతి చిన్న పాత్ర దగ్గర నుండి పెద్ద పాత్రల వరకు నటించారు అనే కంటే జీవించారని చెప్పవచ్చు అన్నారు. కృష్ణా ఆర్ట్స్ యొక్క చరిత్రలో గాని, 2026వ సంవత్సర నాటక పరిషత్ లలో గాని ద్వారబంధాల చంద్రయ్య నాయుడు నాటిక చారిత్రాత్మకం గా నిలిచిపోతుంద నడంలో సందేహం లేదన్నారు.లిఅదే విధంగా మాకు ఇంత చక్కటి అవకాశాన్ని ఇచ్చిన ఎన్టీఆర్ కళా పరిషత్, ఒంగోలు నిర్వాహకులు ఈదర హరిబాబు కి, సహేతుకమైన జడ్జిమెంట్ ను ఇచ్చిన న్యాయనిర్ణేతలకు ఆర్.వి.ఎల్. నరసింహారావు మరియు నరహరిశెట్టి ప్రసాద్ లు ధన్యవాదాలు తెలిపారు.

# క్రీడల అభివృద్ధికి కేంద్ర సహకారం

## – ఎంపీ సానా సతీష్ బాబుకు సాప్ చైర్మన్ రవి నాయుడు కృతజ్ఞతలు



**కాకినాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** క్రీడల అభివృద్ధికి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. బుధవారం కాకినాడకు విచ్చేసిన ఆయన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని కాకినాడ డీఎస్సీ మైదానం, జేఎన్టీయూ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కాకినాడకు రావడం జరిగిందని శాప్ చైర్మన్ అనిముని రవి నాయుడు తెలిపారు.ఈ సంద ర్భంగా గౌరవ రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయాన్ని కూడా సందర్శించడం జరిగిందన్నారు.క్రీడల అభివృద్ధికి ఎంపీ సానా సతీష్ బాబు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఒక్క క్రికెట్‌కే పరిమితం కాకుండా, అనేక ఇతర క్రీడా కార్యక్రమాలు, స్పోర్ట్స్ యాక్టివిటీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు రాబట్టడంలో ఎంపీ కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కాకినాడపై ప్రత్యేక దృష్టి సారించి, క్రీడల మౌలిక వసతులు మరింత మెరుగుపడేలా స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్డింగ్‌కు సంబంధించి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళు న్నారని రవి నాయుడు పేర్కొన్నారు. అలాగే ఎంపీ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన వ్యవస్థ తనను ఎంతో ఆకట్టుకుందని తెలిపారు. గ్రీవెన్స్ పరిష్కారం, కార్యకర్తలతో అనుసం ధానం, పేద ప్రజల సమస్యలకు గౌరవంగా స్పందించే విధానం, వచ్చిన ప్రతి సమస్యను ట్రాక్ చేస్తూ పరిష్కార దిశగా ముందుకు తీసుకెళ్లే విధానం చాలా అద్భుతంగా ఉందన్నారు. ఎన్నో కార్యాలయాలు చూసినప్పటికీ,ఎంపీ సానా సతీష్ బాబు కార్యాల యం ప్రజా సమస్యల పరిష్కారానికి నిజమైన మోడల్‌గా ఉందని అభిప్రాయపడ్డారు. ఇలాంటి నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్న రవి నాయుడు, కాకినాడ అభివృద్ధికి, ముఖ్యంగా క్రీడల రంగంలో విశేషంగా కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయం ఇన్చార్జి మేకా లక్ష్మణ్ మూర్తి ఘనంగా సత్కరించి జ్ఞాపకం అందజేశారు. కార్యాలయం సిబ్బందిని శాప్ చైర్మన్ రవి నాయుడుకు పరిచయం చేశారు. కార్యక్రమంలో డి ఆర్ యు సి సి సభ్యులు ముత్యాల అనిల్ కుమార్ ,న్యూటన్ ఆనంద్,సిరియాల కొండబాబు,అంకం రెడ్డి రామునాయుడు, ఉదయ్ పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# "ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం" సందర్భంగా అవగాహన ర్యాలీ..

**కాకినాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** "ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం" సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డా. జె.నరసింహా నాయక్ కార్యాలయం నుండి సిబ్బందితో కలిసి ప్రజలకు క్యాన్సర్ పట్ల అవగాహనా ర్యాలీ మరియు మానవహారం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. జె.నరసింహా నాయక్ మాట్లాడుతూ, సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవన శైలి లో మార్పులు రావడం తో అసంక్రమిత వ్యాధులు దీర్ఘ కాలిక వ్యాధులు పెరుగుతున్నాయి. బి. పి., షుగర్ లతో పాటు ఈ రోజుల్లో క్యాన్సర్ కేసులు కూడా గణనీయం గా నమోదు అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తం గా ప్రతి సంవత్సరం చాలా ఎక్కువ సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తింప బడుతున్నాయి. వీటిలో చాలా కేసులు ఆలస్యం గా గుర్తించబ డటం తో రేడియో , కీమో చికిత్సలు తీసుకోవలసిన అవసరం రావడం, తిరిగి నయం చేయలేని స్థితి లో వుండటం తో అధిక మరణాలు సంభవిస్తున్నాయి. ఈ పరిస్థితులలో పేషెంట్ తో పాటు కుటుం బాలు అధిక ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి ని ఎదుర్కొంటున్నాయి. దీనికి ఒకే ఒక పరిష్కారం --"ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం మరియు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం". బి. పి., షుగర్ పరీక్షలు ఎంత ముఖ్యమని భావనలో వున్నారో, అదే విధంగా క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవడం లో వుండాలి. క్యాన్సర్ అంటే భయపడాల్సిన పని లేదు , ముందుగానే గుర్తిస్తే పూర్తిగా నయం చేయగల వ్యాధి. ఇది రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాల పైబడిన ప్రతి



పౌరునికి ఉచితం గా నోటి, రొమ్ము మరియు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోంది. ఈ పరీక్షలు చేయించుకోవడానికి మీ ఇంటి వద్దకు వచ్చే ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందికి సహకరించండి. అలాగే, మీ సమీపంలోని ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు పూర్తిగా ఉచితంగా చేయబడతాయి. అని తెలియజేసారు. ఈ కార్యక్రమం డి.ఐ.వొ.డా.కె.సుబ్బరాజు, పి.ఒ.ఎన్.సి.డి. & ఆర్.బి.యస్.కె. డా.వి.అరుణ, డి.యం.వొ. డా.ఐ.ప్రభాకర్,డి.పి.యం.యు.డా.జి.లక్ష్మి,ఫైలేరియా వైద్యాధికారి డా.రవి,డిప్యూటీ డెమో కె.సూర్యచంద్రరావు ,డి.పి.హెచ్.ఎన్.ఒ. నీలవేణి, కార్యాలయ సిబ్బంది, ఎన్.సి.డి.సిబ్బంది ,ఎం.ఎల్.హెచ్. పి.లు తదితరులు పాల్గొన్నారు.

# బాపులపాడు పశువైద్యశాలను తనిఖీ చేసిన డిడి డాక్టర్ ఎల్ నాగేశ్వరరావు



**హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** గన్నవరం పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎల్ నాగేశ్వరరావు బాపులపాడు పశువైద్యశాలలో సంపూర్ణ తనిఖీ నిర్వహించి పశు వైద్యశాల సిబ్బంది సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పశు వైద్యులు పారా వెటర్నరీ సిబ్బంది మరియు రైతు భరోసా కేంద్రం యొక్క పశుసంవర్ధక సహాయకులకు ప్రభుత్వం ద్వారా నిర్దేశించినటువంటి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, సిబ్బంది అందరూ రైతులకు అందుబాటులో ఉంటూ పశు వైద్య సేవలను సక్రమంగా అందించాలని, వెయ్యదూడల వీర్యం యొక్క ఆవశ్యకతను రైతులకు తెలియజేసి ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందేలా చూడాలని, సిబ్బందికి దిశ నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపులపాడు పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ యం. ప్రమీలారాణి , గన్నవరం ఉపసంచాలకు వారి కార్యాలయ సహాయ సంచాలకులు, డాక్టర్ పి చంద్రమోహన్, ఆఫీస్ సూపరిండెంట్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోడు హైస్కూల్ నందు ఊరి బడిని కాపాడుదాం పోస్టర్ ఆవిష్కరణ..




**కృత్తివెన్ను,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** కృతివెన్ను మండల వనరుల కేంద్రం నందు మండల విద్యాశాఖ అధికారులు మహమ్మద్ అన్వర్ జానీ కె ఎస్ వి డి ప్రసాద్ , యుటిఎఫ్ చేపట్టిన "ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పిద్దాం ఉరి బడిని కాపాడుకుందాం అనే పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుటకు ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ ప్రత్యేక కృషి చేయవలెనని కోరి యున్నారు. ఈ కార్యక్రమంలో ఉండి పురుషోత్తం రాజులపాటి పట్టాభి రామయ్య, పొన్నాల నాగరాజు వెంట్రపాటి నాగరాజు తిరుమణి నరసింహస్వామి శానా రామకృష్ణ బొర్రా వీరాస్వామి జై వీరాంజనేయులు యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కొప్పినీడి సూర్యప్రకాష్ మొదలైన వారు పాల్గొన్నారు.

# కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ - అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్

**గుడివాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ నందు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పోస్టుల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి. 1) టైపిస్టు కం అసిస్టెంట్ – 03 పోస్టులు అర్హతలు : ఏదైనా డిగ్రీ, ఇంగ్లీష్ టైప్‌రైటింగ్ హయ్యర్ కంప్యూటర్ సర్టిఫికెట్.. వయోపరిమితి : ప్రస్తుతం అమలులో ఉన్న గవర్నమెంట్ రూల్స్ 2) ఆఫీస్ సబార్డినేట్ –03 పోస్టులు అర్హతలు 7వ తరగతి పాస్, ఇంటర్ ఫెయిల్, హయ్యర్ క్వాలిఫికేషన్ నాట్ అలౌడ్.. వయోపరిమితి : ప్రస్తుతం అమలులో ఉన్న గవర్నమెంట్ రూల్స్.. ఇతర వివరాలకు మరియు సంబంధిత నోటిఫికేషన్, అప్లికేషన్ కొరకు కృష్ణా జిల్లా కోర్టు వెబ్సైట్ను చూడగలరు. కాగ దరఖాస్తులు సమర్పించడానికి ఈనెల 17వ తేదీ లోపుగా దరఖాస్తులు సమర్పించాలనీ పేర్కొన్నారు.

# నిజమైన దోషులను గుర్తించేందుకే కమిటీ ఏర్పాటు

## –కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు



**గుడివాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం తిరుమల శ్రీవారు లడ్డు విషయంలో కమిటీ నియమించడాన్ని స్వాగతిస్తున్నట్లు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు పేర్కొన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో మీడియా తో మాట్లాడుతూ ఆయన వైసీపీ ప్రభుత్వంలో ఒక చుక్క నెయ్యి కూడా లేకుండా లడ్డు తయారు చేసి వ్యక్తులు ఈ రోజున లడ్డులో కల్తీ జరగలేదని వాదించడాన్ని రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుం టున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం ఈ కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని.. ఈ కమిటీ, కల్తీకి బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం మరియు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టడంపై దృష్టి సారించనుందన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో (2019–2024) జరిగిన తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలు, కల్తీ నెయ్యి సరఫరాపై లోతైన దర్యాప్తు జరపడం అన్నారు. కల్తీ నెయ్యి విషయంలో వచ్చిన ఆరోపణలను ఎన్‌డీడీబీ ధృవీకరించినట్లు నివేదికను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగ ఈ చర్యలను వైఎస్సార్సీపీ తప్పు పడుతూ ఇది కక్షపూరిత రాజకీయమనీ ఆరోపిస్తుందన్నారు. ఈ కమిటీ కల్తీ వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించనుందనీ.. దోషులు ఎంతటి వారైన ప్రజలే తగిన బుద్ధి చెప్తారని మజ్జాడ నాగరాజు స్పష్టం చేశారు.

# క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తిస్తే చికిత్స తేలిక



**గుడివాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశాల ఉమెన్ డెవలప్ మెంట్ సెంటర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పర్వతనేని వెంకట అనసూయ దేవి మరియు లింగం విమల స్మారక ఉపన్యాసానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కె. లక్ష్మి ప్రియదర్శిని (హెచ్ సి జి సిటీ క్యాన్సర్, విజయవాడ) మాట్లాడుతూ క్యాన్సర్ ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే అనేక రకాల క్యాన్సర్ లను నయం చేయవచ్చునని, ఈ ప్రాణాంతక వ్యాధి గురించి అవగాహన కల్పించడం మరియు ముందస్తుగా గుర్తించడం ముఖ్యమని తెలిపారు. ప్రతి సంవత్సరం 10 లక్షలు పైగా క్యాన్సర్ కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం నివారణ వ్యూహాలను అమలు చేయడం ద్వారా నలభై శాతం కంటే ఎక్కువ క్యాన్సర్లను నివారించవచ్చునని, ప్రారంభ దశలో గుర్తించబడిన క్యాన్సర్ తరువాతి దశ నిర్ధారణ కంటే చాలా మనుగడ రేటుకు కలిగి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్ర మం లో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె. ఎస్. అప్పారావు కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ యల్. ఆర్. కే. ప్రసాద్, ట్రెజరర్ పర్వతనేని కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. జె. ఎస్. కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి. ఎస్. ఎస్. పద్మజ, ఉమెన్ డెవలప్ మెంట్ చైర్ పర్సన్ డి. విమల కుమారి, సెక్రటరీ ఎ. దుర్గ భవాని, మహిళా అధ్యాపకులు, విద్యార్థినిలు, పర్వతనేని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభ దశలోనే క్యాన్సర్ ను గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చు.. వైద్యాధికారి సువర్చల..




**కృత్తివెన్ను,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా బుధవారం పెద తుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె సువర్చల ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం అయినది. దైనందిన జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు , పొగాకు ,గుట్కా వంటి వాటిని వాడడం, డ్రగ్స్ మద్యం వంటి మత్తు పదార్థాలు వాడడం, శారీరక శ్రమ, వ్యాయామం లేకపోవడం కాలుష్యం వంటి కారణాలతో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతుంది. మరియు క్యాన్సర్ గురించిన అవగాహన లేకపోవడంతో ముందస్తు పరీక్షలు చేయించుకోక పోవడం వలన చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు కనుక అవగాహనతో ముందస్తు పరీక్షలు చేయించుకుని ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం నుండి బయటపడి ఆదర్శంగా నిలబడవచ్చు అని తెలియజేయడం జరిగింది, మీ ఇంటి వద్దనే 18 సంవత్సరాలు దాటిన ప్రతివారికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు చేయడం జరుగుతుంది. ముందస్తు పరీక్ష చేయించుకుని క్యాన్సర్ నుండి రక్షణ పొందవలసిందిగా తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ వి ఓ ఎం ఏడుకొండలరావు, సూపర్వైజర్ ఎం ఏసుదాసు ,హెల్త్ అసిస్టెంట్ బి రాజారావు, ఎం ఎల్ హెచ్ పి ఎస్ , ఏఎన్ఎమ్స్, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది , ప్రజలు పాల్గొన్నారు.

## బాపులపాడు పశువైద్యశాలను తనిఖీ చేసిన డిడి డాక్టర్ ఎల్ నాగేశ్వరరావు





**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** గన్నవరం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ ఎల్ నాగేశ్వరరావు బాపులపాడు పశు వైద్యశాలలో సంపూర్ణ తనిఖీ నిర్వహించి పశు వైద్యశాల సిబ్బంది సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పశు వైద్యులు పారా వెటర్నరీ సిబ్బంది మరియు రైతు భరోసా కేంద్రం యొక్క పశుసంవర్ధక సహాయకులకు ప్రభుత్వం ద్వారా నిర్దేశించినటువంటి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని, సిబ్బంది అందరూ రైతులకు అందుబాటులో ఉంటూ పశు వైద్య సేవలను సక్రమంగా అందించాలని, వెయ్యదూడల వీర్యం యొక్క ఆవశ్యకతను రైతులకు తెలియజేసి ఎక్కువ మంది రైతులు లబ్ధి పొందేలా చూడాలని, సిబ్బందికి దిశ నిర్దేశం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపులపాడు పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ యం. ప్రమీలారాణి , గన్నవరం ఉపసంచాలకు వారి కార్యాలయ సహాయ సంచాలకులు, డాక్టర్ పి చంద్రమోహన్, ఆఫీస్ సూపరిండెంట్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ నోట్ల ముఠాకు చెక్ పెట్టిన కృష్ణాజిల్లా పోలీసులు...





**కృత్తివెన్ను,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** నకిలీ నోట్లు చలామణి చేసే ముఠాకు చెక్ పెట్టిన కృష్ణాజిల్లా పోలీసులు. వివరముల్లోకెళ్తే కృత్తివెన్ను మండలం సంగమూడి లోని ఓ వైన్ షాప్ లో నకిలీ నోట్ల మార్పిడి చేస్తుండగా దుకాణదారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నకిలీ నోట్లు చలామణి చేస్తున్న, నిందితులు రంజిత్ సింగ్ , బ్రహ్మ ఉమా శంకర్, మరో ఇద్దరినీ అదుపులోనికి తీసుకున్నారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం కోకవాణి పాలెం లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని దొంగ నోట్లు ముద్రిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వారి వద్ద నుంచి 6 లక్షల 2,400 రూపాయల నకిలీ ప్రింటింగ్ సామాగ్రిని స్వాధీన పరుచుకున్నారు. సంక్రాంతి సందర్భంగా కొంత నకిలీ నోట్లు చెలమణీ చేసిన యువకులు మిగిలిన వాటిని వైన్ షాపులు, పెట్రోల్ బంకుల్లో మార్చేందుకు ఎత్తునించారని పోలీసులు తెలియజేశారు. నిందితులపై కేసు నమోదు చేసి బంటుమిల్లి కోర్టుకు తరలించినట్టు కేసు వివరాలను జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలియజేశారు.


**IN THE COURT OF THE HON'BLE II ADDL. CIVIL JUDGE (SENIOR DIVISON) AT VIJAYAWADA**

E.A.NO : 37/2025 IN E.P.NO : 96/2022 IN O.S. NO : 673/2012

Between :

Morla Chandramma, W/o Late Srinivasa Rao. D.No:18-11-3, Khudus Nagar, 5th lane, Kedareswara Pet, Vijayawada. -----DHR

**VERSUS**

1) Chimma Chitti Babu, S/o Late Narayana Swamy, R/o 18-7-76, Opp Six pumps Street Kedareswara Pet, Vijayawada-3. **(JDR 1)**

2) Chimma Vijaya Lakshmi, W/o Chimma Chitti Babu, R/o 18-7-76, Opp Six pumps Street Kedareswara Pet, Vijayawada-3. **(JDR 2)**

3) Oleti Prasanna Rani, W/o Late Oleti Krishna Kishor, R/o 18-10-23, Rama Krishna Nagar, Kedareswara Pet, Vijayawada. **(Proposed 3th JDR)**

4) Oleti Venkata Raghava, S/o Late Oleti Krishna Kishor, R/o 18-10-23, Rama Krishna Nagar, Kedareswara Pet, Vijayawada. **(Proposed 4th JDR)**

5) Oleti Venu Vardhan, S/o Late Oleti Krishna Kishor, R/o 18-10-23, Rama Krishna Nagar, Kedareswara Pet, Vijayawada. **(Proposed 5th JDR)**

-----JDRS

(3 to 5 are the proposed JDR'S of the E.P. Proceedings)

పై నెంబరు E.P. Proceedings లో శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను Proposed JDR'S 3 to 5 తీసుకొనక, కాలయాపన చేయుచున్న ందున శ్రీ కోర్టు వారి Order ప్రకారము పై నెంబరు JDR'S 3 to 5 ది.24-02-2026న తేదిన పై తెలిపిన కోర్టు వారి సమక్షములో ఉ.10.30ని॥లకు హాజరు కావలయును. లెనిచో శ్రీ కోర్టు వారు తీసుకొనే నిర్ణయములకు బాధ్యులు అగుదురు అని ఇందుమూలముగా తెలియచేయచున్నాము.

ఇట్లు

**కె.వి.రాఘవరావు, అడ్వకేట్**

సత్యనారాయణపురం, విజయవాడ-11

సెల్ : 9848258876, 9246494463

విజయవాడ

ది.27-01-2026


# ఆరుగోలను జడ్పీ హైస్కూల్ వార్షికోత్సవం

## రూ.58.5 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం







**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా బాపులపాడు మండలం ఆరుగొలను గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జడ్పీ స్కూల్ ప్రహరీ గోడ, సిమెంటు రోడ్డు ప్రారంభోత్సవం మరియు పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రవాణా రోడ్లు మరియు భవనాల శాఖ మౌలిక సదుపాయాలు--పెట్టుబడుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంపీ కృష్ణబాబు, ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొని అభివృద్ధి పనులను ప్రారంభించారు. MGNREGS నిధులు రూ.23 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను, రూ.7 లక్షలతో వేసిన సిమెంటు రోడ్డును వారు ప్రారంభించారు. అలాగే జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు మరియు ప్రభుత్వ నిధులు కలిపి మొత్తం రూ.21 లక్షలతో నిర్మించిన మూడు తరగతి గదులు, సాయి దీపా రాక్ డ్రిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.విద్య లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంపీ కృష్ణబాబు మాట్లాడుతూ, పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సంఘం (అలుమ్ని అసోసియేషన్) కీలక పాత్ర పోషిస్తున్నదని అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు పూర్వ విద్యార్థులు 30 నుంచి 40 శాతం వరకు ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 330 నుంచి 350 మంది విద్యార్థులు చదువుతుండగా, అందులో 97 మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదు-పాయాలు, సమర్థులైన ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన విద్యాలయాల వల్ల అనేక మంది ఉన్నత శిఖరాలకు ఎదిగారని అన్నారు. ఇదే పాఠశాలలో చదువుకుని ఐఏఎస్ అధికారిగా ఎదిగి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఈ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. గతంలో సీతారామయ్య సెయింట్ జాన్స్ స్కూల్ ఏర్పాటుకు భూమిని దానం చేయడం వల్ల అనేక మంది ఎన్ఆర్ఐలుగా విదేశాల్లో స్థిరపడిన ఉదాహరణను గుర్తు చేస్తూ, గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. కృష్ణబాబు సేవలను ఆదర్శంగా తీసుకుని ఎన్ఆర్ఐలు కూడా ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ చదువుకున్న పాఠశాలలను మర్చిపోకుండా, ఉన్నత స్థాయిలో ఉన్న వారు వీలైనంత మేర సహాయం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, అలుమ్ని అసోసియేషన్ సెక్రటరీ జాస్తి శరత్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గా ప్రసాద్‌తో పాటు విద్యార్థులు, అలుమ్ని సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సహకార సంస్థల పరిపాలనపరమైన సమస్యలు పరిష్కరించండి.

- ముఖ్యమంత్రిని కలిసిన కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం



**మచిలీపట్నం,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీబీ) చైర్మన్ నెట్టెం రఘురాం బుధవారం అమరావతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిసి, కేడీసీసీ బ్యాంక్ పరిధిలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఏసిఎస్) వాటిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు పరిపాలనా అంశాలపై పరిష్కారాన్ని కోరుతూ ముఖ్యమంత్రి వినతిపత్రం సమర్పించారు. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో పిఏసిఎస్ సంఘాల్లో సీఈఓ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న అర్హులైన ఉద్యోగులకు ఒకసారి ప్రత్యేక ప్రమోషన్లను పరిశీలించవలసిందిగా ఆయన అభ్యర్థించారు. పలు గ్రామీణ పిఏసిఎస్ సంఘాలు డైలీవేజ్ సిబ్బందిపై ఆధారపడి పనిచేస్తున్నాయని, అందువల్ల అర్హత పరీక్ష నిర్వహించి, అర్హులైన వారికి న్యాయబద్ధంగా అవకాశం కల్పించాలనే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లారు. కేడీసీసీ బ్యాంక్ , పిఏసిఎస్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు విషయమై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తింపజేసిన విధంగా వీరికి కూడా పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచితే అనుభవజ్ఞులైన సిబ్బంది సేవలు మరింత కాలం అందుబాటులో ఉంటాయని తెలిపారు. కొన్ని వేతనాలు "సస్పెన్స్ డ్యూ టు అకౌంట్" కింద నిల్వ ఉండటం వల్ల ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వాటిని క్రమబద్ధీకరించేందుకు తగిన మార్గదర్శకాలు జారీ చేయవలసిందిగా ఆయన కోరారు. అదేవిధంగా, అవసరమైన విద్యార్హతలు పొందేందుకు గతంలో ఇచ్చిన గడువును మరికొంత కాలం పొడిగిస్తే గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఉద్యోగులకు ఉపశమనం కలుగుతుందని, వారి ఉద్యోగ భద్రత కాపాడబడుతుందని అభ్యర్థించారు. ఈ వినతులన్నీ ఉద్యోగుల ప్రయోజనాలకే పరిమితం కాకుండా, గ్రామీణ సహకార వ్యవస్థ బలోపేతానికి, రైతులకు నిరంతర సేవలందించేందుకు దోహదపడతాయని నెట్టెం రఘురాం తెలిపారు. ముఖ్యమంత్రి నెట్టెం రఘురాం వినతిని శ్రద్ధగా విని, సంబంధిత శాఖలతో పరిశీలించి సాధ్యమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

## హెల్మెట్ తప్పక ధరించాలి : క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు తలాటం హరీష్



**కాకినాడ,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు తలాటం హరీష్ సూచించారు. సానా సతీష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ హెల్మెట్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. 50 మందికి వాహనదారులకు హెల్మెట్ లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని కోరారు. తల్లిదండ్రులు పిల్లలకు రోడ్డు నియమాలు ఎలా పాటించాలనే విధానమును,తగు జాగ్రత్తలు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పిడక శేషు,రామ శేషాద్రి, వి.సునీల్ , రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు తొలి విడతగా అక్రిడిటేషన్ల జారీకి ఆమోదం

- పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది - జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి



**ఏలూరు,ఫిబ్రవరి 4 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లాలో దరఖాస్తు చేసుకున్న పాత్రికేయులతో అర్హులైన ప్రతీ ఒక్కరికీ అక్రిడిటేషన్ మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వ జీవో నం 84 నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇంకనూ అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మరియు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి రెండవ సమావేశం లో అక్రిడిటేషన్లు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే ఆమోదం తెలిపిన అప్లికేషన్లు మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా పాత్రికేయులు సమాజానికి ప్రభుత్వానికి వారిదిగా ఉంటూ ప్రభుత్వం ప్రజలకు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరువుగా తీసుకెళ్లే విధంగా సమాచార శాఖతో పాటు పాత్రికేయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు వివిధ సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించగా, పరిశీలించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బి.కె. కిషోర్, కె. శంకరరావు, వి. విద్యాసాగర్, ఎం. శ్రీనివాసరావు, డి. వెంకటరమణ, ఎస్. శాంతకుమార్, ఎన్ . ఈశ్వర్, కె.ఎన్ .వి. శివసాగర్, జి. రఘురామ్, ఎస్. సంజయ్ కుమార్, ఎం. పగడం కళ్యాణ్, ఐ. వి.వి. ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. అమృతం, కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ జి. సత్యనారాయణ, పోలీసు అధికారి కె. కేశవరావు, ప్రభృతులు పాల్గొన్నారు.


**IN THE COURT OF HON'BLE II ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA**

I.P. No. 54 of 2024

Between :

Reesu Parameshwar ----Petitioner

And

Chalapaka Lakshmi & Others ----Respondents

**R3.**

Gangadhar, Door No.29-1-39, Near Municipal Office, Bharath Petrol Bunk, Gokavaram. Bus Stand, Rajahmundry, East Godavari District.

**R5.**

Sudarshanam, S/o Venkata Subbaiah, Door No.1-3/24-3/8, Appalaswamy Quarry, Chandoluvari Street, Vidyadharapuram, Vijayawada-12

**R6.**

Smt. Sri Devi, Door No.1-4/8-19, Rajyalakshmi Apartments, Beside Gurukrupa Residency, Vidyadharapuram, Vijayawada-12

పై నెంబర్ గల దావా నందు పైన తెలిపిన ప్రతివాదులుకు సమాన్లు అందజేయు నిమిత్తం ది.06-03-2026 తేదీన కోర్టు వారు వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాదులు వాయిదా రోజు ఉదయం : 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల వారిపై పరోక్షమందు సదరుపై దావా తీర్మానం కాబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**(కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం)**

ఇట్లు:

**M. Kanaka Chari (Balu), A. Mamatha Sravani**

**Advacates**

**Vijayawada. Cell : 9393410716**



**IN THE COURT OF HON'BLE I ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA**

E.A.No : 60/2025 in E.P. No : 4 of 2022 in O.S.No.577 of 2012

Between :

Yerrapati Veera Venkata Gopi Krishna ----DHR/Plaintiff

And

1. Kona Srinivas,
2. Kona Sriram, ----JDRs/Defendants

1. Kona Srinivas, S/o Late Venkata Narayana, Door No.40-15-2, House No.106, 4th Floor, Green Lands Hotel Road, Braundavan Colony, Labbipet, Vijayawada-10
2. Kona Sriram, S/o Late Venkata Narayana, Door No.40-15-2, House No.106, 4th Floor, Green Lands Hotel Road, Braundavan Colony, Labbipet, Vijayawada-10

పై నెంబర్ గల దావా నందు పైన తెలిపిన ప్రతివాదులుకు సమాన్లు అందజేయు నిమిత్తం ది.17-02-2026వ తేదీన కోర్టు వారు వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాదులు వాయిదా రోజు ఉదయం : 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల వారిపై పరోక్షమందు సదరుపై దావా తీర్మానం కాబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**(కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం)**

ఇట్లు:

**M. Kanaka Chari (Balu), A. Mamatha Sravani**

**Advacates**

**Vijayawada. Cell : 9393410716**



**IN THE COURT OF HON'BLE I ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA**

E.A.No : 62/2025 in E.P. No : 7 of 2022 in O.S.No.499 of 2012

Between :

Mamidisetty Venkata Rama Rao ----DHR/Plaintiff

And

1. Kona Srinivas,
2. Kona Sriram, ----JDRs/Defendants

1. Kona Srinivas, S/o Late Venkata Narayana, Door No.40-15-2, House No.106, 4th Floor, Green Lands Hotel Road, Braundavan Colony, Labbipet, Vijayawada-10
2. Kona Sriram, S/o Late Venkata Narayana, Door No.40-15-2, House No.106, 4th Floor, Green Lands Hotel Road, Braundavan Colony, Labbipet, Vijayawada-10

పై నెంబర్ గల దావా నందు పైన తెలిపిన ప్రతివాదులుకు సమాన్లు అందజేయు నిమిత్తం ది.17-02-2026వ తేదీన కోర్టు వారు వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాదులు వాయిదా రోజు ఉదయం : 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల వారిపై పరోక్షమందు సదరుపై దావా తీర్మానం కాబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**(కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం)**

ఇట్లు:

**M. Kanaka Chari (Balu), A. Mamatha Sravani**

**Vijayawada, Cell : 9393410716**



**IN THE COURT OF HON'BLE I ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA**

E.A.No : 61/2025 in E.P. No : 5 of 2022 in O.S.No.1456 of 2009

Between :

Kukkala Sivaram Kumar ----DHR/Plaintiff

And

1. Kona Srinivas,
2. Kona Sriram, ----JDRs/Defendants

1. Kona Srinivas, S/o Late Venkata Narayana, Door No.40-15-2, House No.106, 4th Floor, Green Lands Hotel Road, Braundavan Colony, Labbipet, Vijayawada-10
2. Kona Sriram, S/o Late Venkata Narayana, Door No.40-15-2, House No.106, 4th Floor, Green Lands Hotel Road, Braundavan Colony, Labbipet, Vijayawada-10

పై నెంబర్ గల దావా నందు పైన తెలిపిన ప్రతివాదులుకు సమాన్లు అందజేయు నిమిత్తం ది.17-02-2026వ తేదీన కోర్టు వారు వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాదులు వాయిదా రోజు ఉదయం : 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల వారిపై పరోక్షమందు సదరుపై దావా తీర్మానం కాబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**(కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం)**

ఇట్లు:

**M. Kanaka Chari (Balu), A. Mamatha Sravani**

**Advacates**

**Vijayawada. Cell : 9393410716**



**Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188**